## పశ్చాత్తాప ప్రార్థన

పరమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము,
అపవిత్రమును అగు
మా ప్రతి మాటకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకు
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకు,
సమస్త కపటవర్తనమునకు,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకు,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చిన
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసిన
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపమలన్నిటికిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని
మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలమగుచున్న
మమ్ములను క్షమింప వేడుకొనుచున్నాము.


Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310 Postal Concession: R&D/ RNP/789/2009-11, Dt.07-01-2009


# మెహెర్‌బాబా


**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి :10 సంచిక: 10 హైదరాబాద్ 2011 ఫిబ్రవరి పేజీలు: 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ.100/-**




# 48వ వార్షికోత్సవం మెహెరస్థాన్, కొవ్వూరు

**మెహెరస్థాన్, కొవ్వూరు 48వ వార్షికోత్సవం** 28.02.2011 ఉ॥ 7.30 నుండి 1.15 వరకూ నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సి. వై. చింతామణి & పార్టీ, మల్లిక్ & పార్టీ, కాకినాడ, వారిచే సంకీర్తనలు. శ్రీ కోడూరి శివరామకృష్ణ తులసీ వరప్రసాద్, శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ వార్డ్ పార్ప్స్, మెహెరాబాద్, శ్రీ ఎస్. వి. మెహెర్ ప్రసాద్ రాజు తదితరులు బాబావారి సందేశాలపై ప్రసంగిస్తారని తెలిపారు.

శ్రీ ఎమ్.వి.ఆర్.కె.బాలాజీ, ఎడిటర్, అవతార్ మెహెర్ మాస పత్రిక, సభా నిర్వహణ చేయనున్నారని పేర్కొన్నారు.

## శ్రీకాకుళం సెంటర్ స్వర్ణోత్సవాలు

### 2011 ఆగస్టు, 13,14

అవతార్ మెహెర్ బాబా శ్రీకాకుళం కేంద్రాన్ని నెలకొల్పి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2011 ఆగస్టు 13,14 తేదీలలో స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ పి.వి.రంగప్రసాద్ రావు, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బాబా సందేశములతో ఒక స్వర్ణోత్సవ సావనీర్‌ను ప్రచురించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

మెహెర్‌బాబా సందేశాలతో కూడిన రచనలు కవితలు, వ్యాసములు, గేయములు ఇతరత్రా బాబా ప్రేమికులు 30.04.2011లోగా శ్రీ పి.వి. రంగ ప్రసాదరావు, (99850-26433) మెహెర్ నగర్, కత్తెర వీధి, శ్రీకాకుళం పంపవల్సిందిగా కోరారు.

# కదిరి కేంద్రం

అనంతపురం జిల్లాలోని కదిరి పట్టణంలో 23.07.2011 నుండి 25.07.2011 వరకు మూడు రోజులపాటు అవతార్ మెహెర్‌బాబా ప్రేమికుల సహవాస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆహ్వానం పంపారు.

ఈ కార్యక్రమంలో బి.రామకృష్ణయ్య, పి. హరినాధ్ గుప్తా, జే.మదనగోపాల్, ఎ. రామ కుమార్, ఎస్. సత్యనారాయణ తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.





# బాబా సందేశం

మనస్సును అదుపులో ఉంచండి. హృదయ భావాలకు ప్రాధాన్యత ఇవ్వండి. మనస్సును గట్టి రాయిలా అదిమి పెట్టండి. హృదయం పరిధిలో మీరు పనిచేసేలా ప్రయత్నించండి. మనస్సును దాని మానాన అది పరిభ్రమించేందుకు అనుమతించకండి. **-మెహెర్‌బాబా**

గౌరవ సంపాదకులు
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
040-65699611
040-64542370

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. 42వ అమరతిథి విశేషాలు 6-9
3. అమరతిథి- స్వాగతోపన్యాసం 10-13
4. కేశవ్ నారయణ్ నిగం 14-19
5. లార్డ్ మెహెర్ 20-22
6. మంత్రవాది బాబాలో ఐక్యం 24-27
7. యాద్ రఖ్ 28-29
8 DIVINE THEME 30
9. గణపతి రావు బాబాలో ఐక్యం 31
10. మా మాటలు 32-33
11. ఇంతేకదా 34-35
10. బాటసారులు 36-37
11. జీవిత సభ్యులు 38

### మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# మెహెర్ మండపేట 47వ వార్షికోత్సవం

**2011 మార్చి 6, ఉదయం 9 గంటల నుండి ఒంటి గంట దాకా**

తూర్పు గోదావరి జిల్లాలోని మెహెర్ మండపేట బాబా సెంటర్ 47వ వార్షికోత్సవాన్ని 2011 మార్చి 6న ఉ. 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట దాకా నిర్వహిస్తున్నట్లు శ్రీ యం. పనసన్న ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, అవతారుడు పాదస్పర్శ సోకిన ఈ ప్రాంతంలోని బాబా సెంటర్‌ను ప్రతి ఒక్కరూ దర్శించుకోవాలని శ్రీ పనసన్న కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్-90306 05678 సంప్రదించగలరు.

# హైదరాబాద్‌లో బాబావారి జన్మదిన వేడుకలు

హైదరాబాద్‌లో బాబావారి జన్మదిన వేడుకలు 2011 ఫిబ్రవరి 25న జూబ్లీ సెంటర్‌లో తెల్లవారుఝామున 5 గంటల నుండి ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి శ్రీ పి. రాజేంద్ర మెహెర్ తెలిపారు.

### బాబా వారి సాద్రా

మెహెరాజాద్‌లోని బాబా మండలివారు హైదరాబాద్ సెంటర్‌కు మెహెర్‌బాబా ఉపయోగించిన సాద్రా నొకదాన్ని చాలా కాలం క్రితం ఇచ్చారు. కాగా, ప్రస్తుతం ఈ సాద్రాను బాబా ప్రేమికులందరూ జూబ్లీ సెంటర్లో దర్శించుకునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లుచేసామని ఆయన తెలిపారు.

ఫిబ్రవరి 25న సాయంత్రం కోఠి సెంటర్ ప్రాంగణంలో, ఫిబ్రవరి 26న సికింద్రాబాద్, ఫిబ్రవరి 27న మల్కాజిగిరి సెంటర్లలో బాబా జన్మదిన వేడుకలు వైభవంగా జరుపనున్నామని అన్నారు. కాగా, ఫిబ్రవరి 27, ఆదివారం, ఉదయం 8 గంటల నుండి రక్తదాన శిబిరం కోఠి సెంటర్‌లో ఏర్పాటుచేసినట్లు, ఈ కార్యక్రమంలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీ రాజేంద్ర మెహెర్ కోరారు.

# హెల్ప్‌లైన్

మీరు ఎటువంటి ఫిర్యాదులనైనా అందించాలంటే **శ్రీ యన్. మహేశ్వర్‌రావు -040-27964050, 9441218841, శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్- 94403-65640,** హైదరాబాద్‌లను సంప్రదించగలరు.





సంపాదకీయం

# నివాళి

మెహెర్‌బాబా ఎన్నో ప్రవచనాలు తన ప్రేమికులకు అందజేశారు.

మరెన్నో ఆధ్యాత్మిక విషయాలను పలు సందర్భాలలో విశదీకరించారు.

మెహెర్‌బాబా రాసిన ' భగవద్వచనం' తదితర గ్రంధాలు నేటి మానవాళి అందరికీ ఎంతగానో ఉపయోగపడతాయి.

మెహెర్‌బాబావారి పలు గ్రంధాలు కొన్ని పాశ్చాత్య విశ్వ విద్యాలయాల్లో స్కాలర్సుకు రిఫరెన్స్ గ్రంధాలుగా వున్నాయి.

బాబావారి ప్రవచనాలు ఇంగ్లీషులో ఎన్ని ఉన్నాయో, అవన్నీ కూడా తెలుగు, దాదాపుగా మరి ఇతర భాషల్లోనూ లభ్యమవుతున్నాయి.

మెహెర్‌బాబా ప్రభోదించి ఒక్కటే.

అందరిలో భగవంతుడున్నాడు. కాబట్టి మీ తోటివారినందరినీ ప్రేమించండి.

ప్రేమ ద్వారా సాధించలేనిది ఏమీ లేదు. ఎదుటివారు సంతోషపడేలా ప్రవర్తించడమే నిజమైన ఆనందమని మెహెర్‌బాబా అనేక సందర్భాల్లో **ఇదే తన ఇచ్ఛగా** పేర్కొన్నారు.

మెహెర్‌బాబా సందేశాలు వినడానికి చాలా సుళువుగా వున్నప్పటికీ, అవి ఆచరణలో సామాన్యులకి అలవికానివని, అందరూ ఎరిగిన సత్యం.

తన ప్రేమికులు తమ ప్రవర్తన ద్వారానే బాబా సందేశవ్యాప్తి చేయాలని కోరారు. ఈ విషయంలో సఫలీకృతులైనవారు ఎందరో వున్నారు. నిరంతరం బాబా నామం జపిస్తూ, ఆయన ధ్యాసలో, ఎలాంటి ఆశలూ లేకుండా, సాదాసీదాగా ఆనందంగా గడిపిన ధన్యులు ఎందరో వున్నారు.

ఆ కోవకు చెందినవారే హైదరాబాద్‌లో వుంటున్న బాబా ప్రేమికులు శ్రీ పి. గణపతిరావు, శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి. కొద్దిరోజుల వ్యవధిలో 2011 జనవరి -ఫిబ్రవరి నెలలలో వీరిరువురూ బాబాలో ఐక్యమయ్యారు.

అనుక్షణం బాబా నామ స్మరణలో గడుపుతూ, బాబావారి ఇచ్ఛను తు.చ తప్పక ఆచరించేందుకు వీరు కృషి చేశారు. బాబా ప్రేమికులందరికీ వీరు ప్రాత:స్మరణీయులు.

మెహెర్‌బాబా పాఠక మహాశయులందరి పక్షాన వీరిరువురికి మనసారా నివాళులు అర్పించుదాం.

# మెహెరాబాద్

# 42వ అమరతిథి విశేషాలు

అవతారుని 42వ అమరతిథి అత్యంత వేడుకగా జరిగింది. ప్రేమిక జన సందోహంతో మెహెరాబాద్ కిట కిటలాడింది. 2011 జనవరి 30,31, ఫిబ్రవరి ఒకటో తేదీలలో అనేక విశేష భజన కార్యక్రమాలు నిర్వహించారు. గత రెండు మూడేళ్ళకంటే కూడా అధిక సంఖ్యలో ప్రేమికులు అమరతిథి కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రస్టువారి గణాంకాల ప్రకారం విచ్చేసిన ప్రేమికుల సంఖ్య రమారమిన 26 వేలకు పైబడి వుందని తెలుస్తోంది. అలాగే, బాబా ప్రేమికులతో వయస్సు రీత్యా పెద్దవారు వారి ఆరోగ్య సమస్యలు ఎన్నివున్నా తట్టుకుని అమరతిథికి ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. యువత కూడా అధిక సంఖ్యలో విచ్చేసారు. పలు ప్రాంతాలనుండి వచ్చిన సుమారు 1100 మంది వాలంటీర్లు విశేషసేవలు అందజేశారు. దిగువ మెహెరాబాద్‌లోని హాస్టల్సుతో పాటు, న్యూసైట్‌లో, న్యూ న్యూ సైట్‌లలో దూరప్రాంతాల నుండి వచ్చిన ప్రేమికులకు బస ఏర్పాట్లు చేసారు. తెలుగువారి కోసం ఏర్పాటు చేసుకున్న ఆంధ్రా రెస్ట్ హౌసులో తెలుగువారికి మాత్రమే కాకుండా అన్ని భాషలవారికీ చక్కని ఆతిధ్యం ఇచ్చారు. ఇక్కడ సుమారు 200 మందికి వసతి సౌకర్యం కల్పించారు. ఇక్కడ అధికశాతం మంది వృద్ధులు కావడం విశేషం. వయస్సు మళ్ళిన వారు, పండు ముసలి వారు ఈ అతిథి గృహంలో వారు ఆశించేరీతిలో ఆతిధ్యం లభించింది. శ్రీ బాలగోపాల భాస్కరరాజు(90) (తాడేపల్లిగూడెం) శ్రీ కె.హనుమంతరావు ఎల్.ఐ.సి., శ్రీ కాళిదాసు, హైదరాబాద్... ఇలా పలువురు పెద్దలు ఆంధ్రా రెస్ట్ హౌస్‌లో బస చేసి అమరతిథిలో ఆనందంగా అవతారుని దివ్య దర్శన భాగ్యం పొందారు. ఐతే ఈ దఫా ఆటోలు, కార్లు మరి ఇతర వాహనాలను ఎగువ మెహెరాబాద్‌లో ఎప్పటిలా ఆంధ్రా క్యాంటీన్ దాకా కూడా అనుమతించ లేదు. వాహనాల పార్కింగ్‌ను దిగువ మెహెరాబాద్ రైలు పట్టాల ప్రక్కన ఏర్పాటు చేశారు. కార్లలో వృద్ధుల్ని తీసుకెళ్ళేవారిని మాత్రం, క్యాంటీన్‌ల కంటే ముందుగా, గతంలోని పార్కింగ్ ఏరియా సమీపంలో వారిని దించి, వాహనాలను తిరిగి నిర్ణీత పార్కింగ్ జాగాలో వుంచాలన్నారు.

ఈ చర్య వయస్సు మళ్ళిన వారికి ఆశనిపాతమైంది.

ఈ విషయంలో వారు ఎన్నో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మూగవేదన అనుభవించారు.








ఇలాంటి పరిస్థితుల్లో కనీసం వీల్ చైర్లు లాంటివి ఏర్పాటు చేయ్యాలి.

కాగా, బాబా ట్రస్టుకు సంబందించిన వాహనాలను ఎప్పటిలా ఎగువ మెహెరాబాద్‌కు అనుమతించారు. ఆయా వాహానాలలో కుర్రకారు సయితం ప్రయాణించడం విశేషం. ఫిబ్రవరి ఒకటో తేదీన కూడా, తెల్లవారు ఝామున 5 గంటల ప్రాంతంలో, నిర్జనంగా వున్న ఎగువ మెహెరాబాద్ పార్కింగ్ ఏరియాలోకి వాహనాలను అనుమతించడానికి వాలంటీర్లు ఆవేశంతో పోటీపడ్డారు. ఏతావాతా- వాహనాల పార్కింగ్ నియమావళిని వచ్చే ఏడాది అమరతిథినాటికైనా పునరాలోచించాలని, కనీసం వృద్ధులు ప్రయాణిస్తున్న వాహనాలను ఎప్పటిలా ఎగువ మెహెరాబాద్‌లోని పార్కింగ్ ఏరియాలో అనుమతించాలని కోరుతున్నారు.

మరో విశేషం ఏమంటే 42వ అమరతిథికి జనవరి 31న బాబావారి దర్శనార్ధం ప్రేమికులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్నారన్న సంగతి తెలిసిన కార్యక్రమ నిర్వాహకులు జనవరి 31న వాలంటీర్లు బాబా దర్శనం చేసుకోరాదని ఆదేశించారు.

విచ్చేసిన వాలంటీర్లు మొత్తం సుమారుగా 1100 మంది. ఐతే, నిర్వాహకులు ఈ నియమాన్ని ఐచ్ఛికంగా నిర్ణయించి వుంటే బాగుండేదని భావించారు. వాలంటీర్లల్లో కూడా కొందరు క్రొత్తగా మెహెరాబాద్‌కు వస్తున్నవారున్నారు. జనవరి 31న, అమరతిథినాడు బాబావారి దర్శనం కోరుతూ ఎంతో దూరం నుండి ఎంతో ప్రయాసతో




వచ్చినవారు వారిలో వున్నారు. వారు నిర్వాహకులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఏకపక్షంగా అభిప్రాయపడ్డారు. ఇదిలావుంటే, "గత కొన్నేళ్ళుగా వాలంటీర్లుగా వస్తున్నా, తాము ఏనాడూ జనవరి 31న అమరతిథినాడు బాబా దర్శనం కోసం టోకెను కూడా తీసుకోలేదు. మెహెరాబాద్‌లో ఎక్కడ వున్నా – బాబా దర్శనం చేసుకున్నట్లేనని" కొందరు బాబా ప్రేమికులు అన్నారు. ఇందులో వాదనలకు తావులేదు. వ్యక్తిగత మనోభావాలు, నమ్మకాలను నిర్వాహకులు ప్రాధాన్యత ఇచ్చి తుది నిర్ణయాధికారం వాలంటీర్లకే ఇచ్చివుంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ విషయమై కూడా వచ్చే అమరతిథి నాటికి తగిన పునరాలోచన చెయ్యాలని స్వఛ్చంద సేవకులు మా ప్రతినిధితో అన్నారు.

జనవరి 31న, అవతారుని అమరతిథినాడు సుమారు 26 వేలమందికి పైగా ప్రేమికులు బాబాను దర్శించుకున్నారు. తెలుగువారికంటే, ఇతర ప్రాంతీయులు అధికంగా విచ్చేసారని ఓ అంచనా.

జనవరి 30 – అర్ధరాత్రి 12 గంటల నుండీ బాబా దర్శన కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి 500 మందికి ఒక టోకెను చొప్పున సుమారు 45 టోకన్లుకు పైగా జనవరి 31 అర్ధరాత్రి దాకా ఇచ్చినట్లు సమాచార బోగట్టా. బాబా దర్శనం రమారమిన 60 నిముషాలు ఒక్కో టోకెనుకు పట్టింది. బాబా సమాధిలోనికి ప్రేమికులను ఒకేసారి ఐదారుగురిని ప్రవేశపెట్టి చాకచక్యంగా ప్రేమికుల 'క్యూ' చకచకా ముందుకు సాగేలా చేశారు. సమాధి దర్శన సమయంలో కూడా అక్కడున్న వాలంటీర్లు చాలా చురుకుగా వ్యవహరించారు.

ఎగువ మెహెరాబాద్‌లో అమరతిథి వేదికను, బాబా సమాధి ప్రాంగణమంతా కూడా చక్కగా పరిశుభ్రంగా అలంకరించారు. నేలపై దుమ్ము, ధూళి లేవకుండా– భారీగా నీటిని చల్లారు. ఐతే, దిగువ మెహెరాబాద్‌లోని హాస్టల్సు ప్రాంగణం మాత్రం ఇందుకు భిన్నంగా, నిలువెత్తు దుమ్ముతో, పెద్ద పెద్ద గులక రాళ్ళతో, ఇబ్బందికరంగా వుండింది.





దిగువ మెహెరాబాద్‌లో హాస్టల్సు దగ్గర ఎప్పుడూ వుంచే మంచి నీటి కుండలు లోటాలు స్థానంలో నీటి కుళాయిలు బిగించిన స్టీలు డ్రంలు ఏర్పాటు చేయడం విశేషం. బాబా సమాధి చెంతలో ఇంకా ఆలనాటి పాత కుండలే కనిపించాయి.

జనవరి 31న అమరతిథి వేదికపై బాబా ట్రస్టు చైర్మన్ భావూజీ అనారోగ్యం కారణంగా రాలేక పోయారు. ఆయన తరపున భావూజీ కుమారుడు మెహెర్‌నాధ్ కల్చూరీ విచ్చేసిన బాబా ప్రేమికులకు స్వాగతం పలికారు. ముందుగా బాబా ట్రస్టు తరపున భావూజీ రాసి పంపిన స్వాగతవచనాలను తెలుగులో శ్రీ బాలగోపాల భాస్కరరాజు గారు, హిందీలో ఎస్.డి. లలిత్ చదివి వినిపించారు.

అమరతిథి వేడుకలను అహ్మద్‌నగర్ బాబా సెంటర్ ప్రేమికులు శ్రీ లక్ష్మీకాంత్ థాడే చక్కగా నిర్వహించారు. ఐతే, వేదికపై భజన గీతాలు ఆలాపించేవారిని ఇక్కడ పాటల పోటీల్లేవు. త్వరగా ముగించండి! అని పలు సెంటర్లనుండి వచ్చిన భజన బృందాలవారిని తొందర పెట్టిన థాడేజీ– జనవరి 31నాడు, మధ్యాహ్నం 12 గంటల నుండి 12.15 దాకా మౌనానికి పూర్వం – నిర్వహించే 'బాబాధున్' వాయిదావేశారు. సుమారు 5–7 నిముషాలు చేసే ఈ 'మెహెర్‌ధూన్' 12 గంటల నుండి ప్రారంభమయ్యే 15 నిముషాల మౌనానికి ప్రేమికులందర్నీ సన్నిద్ధులను చేస్తుంది. అలాంటి 'ధున్' కార్యక్రమాన్ని రద్దు చేసి, ఆ స్థానంలో అహ్మద్‌నగర్ సెంటర్ భజన బృందంచే, ప్రతి ఏడాది మాదిరిగా, ఓ క్రొత్త పాటను పాడించే ఏర్పాటు చేశారు. సంగీత వాయిద్యాల హోరులో వారు ఆలాపించిన పాటలోని భావం, మాధుర్యం ఆహుతులు ఎవరికీ బోధపడలేదు. కాగా మ॥ 12.15 ని॥ 15 నిమిషాల మౌనం విరమించాక **బాబా ధున్** కొద్ది సేపు నిర్వహించారు. అనంతరం, ముందుగా ఇంగ్లీషులో, బాబా ప్రార్ధనలు, ఆరతిని ఆలాపించారు. ఆ పిదప ఇతర అన్ని భాషల్లో బాబా ప్రార్ధనలు, ఆరతి ఆలాపించి మధ్యాహ్న విరామం ప్రకటించారు. బాబా ప్రార్ధనలు శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి సంస్కృతంలో చదివారు. అమరతిథి వేదికపై బాబా ప్రేమికులు పలువురు శ్రీమతి పద్మావతి, శ్రీమతి నాగలక్ష్మి, శ్రీ సన్యాసిరాజు, శ్రీ సి. వై. చింతామణి, శ్రీ పందుగ రమణ, తదితరులు బాబా కీర్తనలు ఆలాపించారు. జనవరి 30వ తేది సాయంత్రం అవతారుని అరుదైన చలనచిత్రం ప్రదర్శించారు. బాబా సందేశాలను విశదీకరిస్తూ, చి॥ మెహెర్ నిధి, కుమారి మెహెర్ ఆశ్చర్య బృందం, రాజాం సెంటర్, చక్కని నృత్య ప్రదర్శన చేశారు. తెట్టెకుంట సెంటర్, కరీంనగర్ జిల్లా వారు ఏర్పాటుచేసిన బాబావారి అమరతిథి ప్రసాదంగా ఉచిత భోజన కార్యక్రమంలో బాబా ప్రేమికులు చాలామంది పెద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, శ్రీ పందుగ రమణ ఆలాపించగా, శ్రీ దుగ్యాల ప్రభాకర్ రావ్, తెట్టెకుంట సెంటర్ వారు రూపొందించిన ఆడియో సి.డిని శ్రీ మెహెర్‌నాధ్ అవిష్కరించారు.

# అవతార్ మెహెర్‌బాబా వారి 42వ అమరతిథి

**వి.ఎస్. కల్చూరీ (భావూ)**
**స్వాగతోపన్యాసము,**
**చైర్మన్, అవతార్ మెహెర్‌బాబా పేర్‌పెట్యుఅల్ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్,**
**2011 జనవరి 31, మెహెరాబాద్ కొండ**
**(అనువాదం-బాలగోపాల భాస్కరరాజు)**

**–ప్రియతమ అవతార్ మెహెర్‌బాబా వారి మా యొక్క ప్రియతములారా!**

అవతార్ మెహెర్‌బాబా పెర్‌పెట్యుఅల్ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్, మెహెరాబాద్ మండలి, వాలంటీర్లు అందరి తరపున, ప్రియతమ అవతార్ మెహెర్‌బాబా వారి 42వ అమరతిథికి విచ్చేసిన మీ అందరకు స్వాగతం యిచ్చేందుకు నేను అత్యంత ఆనందంగా వున్నాను. నా ఆరోగ్యం కారణంగా నేడు నేను హాజరుకాలేక పోయినప్పటికీ, ఈ అమరతిథి రోజున ప్రియతముని గుమ్మం చెంతకు యేతెంచిన మీ అందరికి నేను ప్రణమిల్లుతున్నాను. ప్రియతముని యందు గల మీ ప్రేమకు నేను నమస్కరిస్తున్నాను. ఆ ప్రేమే ప్రతి సంవత్సరము ఆతని స్వగృహమునకు మిమ్ములను తీసికొని వస్తోంది. అదిగాక ఇచ్చటికి రావలెననే ఉత్కంఠ వున్ననూ రాలేకపోయిన వారికి కూడా నేను నమస్కరిస్తున్నాను.

ఆతని గుప్త ప్రేమను స్వీకరించేటందుకు ఇచ్చటకు విచ్చేసిన తన బిడ్డలందరిని చూడటానికి ఆయన మిక్కిలి ఆనందిస్తూ వుండాలి. ఆయనను ప్రేమించేవారందరికి ఈ ప్రేమ ప్రసాదంను ఆయన ఇస్తాడు. ఆయనయందు శ్రద్ధాశక్తులు కలిగి ముచ్చట పడేవారందరికి కూడా ఆయన ఈ ప్రేమప్రసాదాన్ని ఇస్తాడు. అంతేనా? ఆయనను విమర్శించేవారికి, వ్యతిరేకించేవారికి కూడా ప్రేమ కానుకను ఇస్తాడు. ఎందుచేతనంటే ఆతడు మన కరుణామయుడైన తండ్రి కాబట్టి.

తన సంపర్కంలోనికి తీసికొనిరాబడిన ఆశీర్వదింపబడిన మనం ఎంతటి అదృష్టవంతులమో! మరి అజ్ఞాన అంధకారము నుండి తిరోగమించే అవకాశాన్ని కూడా పొందగల్గినాము. సారహీనమై అవాస్తవమైన ఛాయా మాత్రమైన మాయ సత్య ప్రకాశము వంకకు పురోగమిస్తుంది. కాని అది ప్రశాంతిలో అంతమౌతుంది. అందుకోసమే ప్రియతముని కృషి.

ప్రపంచ పరిస్థితి పోనుపోను క్రమంగా అత్యంత దురవస్థలకు లోనవుతుంది. ఆ విషయంలో ఎవరికీ ఏ విధమైన అభిప్రాయమూ లేదు. అమితమైన బాధలు, వరదలు, అగ్ని పర్వత సంబంధమైన ఉద్భేదములు, భూకంపములు, అగ్ని కీలలు పరివేష్టించే







విపత్తులు, అత్యంత భయము, విపరీతమైన యుద్ధములు మొదలైన మిక్కిలి దురవస్థలకు లోనవుతుంది. అన్నిరకాల చిందరవందర అధ్వాన్న పరిస్థితులు, ఏమి చేయవలెనో, ఏమి చేయకూడదో ఎవ్వరికీ తెలియదు. చివరి దశలో తాము చేయవలసినది ఏమీ లేదని శాస్త్రజ్ఞులు తెలుసుకొంటారు. యావత్తు విశ్వమును తన అదుపులో నుంచుకొనే ఒక మహత్తర శక్తి (అవతార్) మాత్రం వున్నదని గ్రహిస్తారు. మతాలు అనే నదులు, వాటికి సంబంధించిన కర్మకాండతో సహా ఎండిపోతాయి అని మతాచార్యులు తెలిసికొంటారు. ఆయన యొక్క మహత్త్వ విస్తారమునకు అది సమయం అవుతుంది. యావత్తు ప్రపంచము ఆయనను భగవంతుని అవతారమని గుర్తించుతుంది.

ఆయన జొరాస్టరు. ఆయనే రాముడు. ఆయనే కృష్ణుడు, ఆయనే బుద్ధుడు ఏసుక్రీస్తు, మహమ్మద్ ప్రవక్త. మరియూ వర్తమాన యుగంలో మెహెర్‌బాబా. అదే పురాణ పురుషుడు, ప్రవక్త, రసూల్ యుగాంతరములందు పంచ సద్గురువులు భూలోకానికి తీసికొని వచ్చే అవతార పురుషుడు, ఇతడే సచరాచర సమన్వితమైన సృష్టిలో గల రాజ్యములన్నింటికి ఒక విశ్వాత్మకమైన ప్రగతిని కలిగించేటందుకు తన అనంత ప్రేమ ద్వారా మానవజాతిని మేలుకొల్పేటందుకు వచ్చినది, ఇతడే అవతార్ మెహెర్‌బాబా. ఆతని సమాధిపైన ఇలా వ్రాయబడి వున్నది. 1969 జనవరి 31వ తేదీని, ఆయన తన భౌతిక కాయమును విడిచినప్పటికీ ఆయన చాలా చాలా చురుకుగా, అనంతమైన

చురుకుగా వున్నాడు. విశ్రాంతి అనేది లేకుండా అనంతమైన చురుకుదనంతో వున్నాడు. విశిష్టమైన విధంగా తన ధనాగారమైన ప్రేమ సంపదను గ్రుమ్మరించే సమయం ఇదే. అతడు తన పానశాలను తెరచాడు. దప్పికను సృష్టించాడు. తన ప్రేమ మదువును పంచిపెడుతూ వున్నాడు.

ఆతడు తన బిడ్డల ఒక్కొక్క హృదయాన్ని స్పృశించుతూ వున్నారు. మీరు ఎలా వచ్చారు? ఆతని ప్రేమ బాణం గుచ్చుకున్నది. ఈ విశ్వం కోసం అనంతంగా బాధపడుతూనే బాబా తన బాణాన్ని (విడిచి పెట్టిన రోజు ఇది) సంధించిన రోజు ఇది. ఆ బాణం వచ్చి ప్రతి హృదయానికి గుచ్చుకుంది. ఈ రహస్యం ఎవరికీ తెలియదు. ప్రజలు ఆయన వద్దకు ఇంకా ఇంకా వస్తున్నారనేది మనం గమనించుతూ వున్నాం. ఎందుచేత? వారందరికీ తన ప్రేమ బాణం గుచ్చుకుంది. అది ప్రపంచ ప్రజల అందరికీ తన ప్రేమ బాణం గుచ్చుకుంది. అది ప్రపంచ ప్రజల అందరి హృదయాలకు గుచ్చుకుంది. ఆ ప్రేమ బాణం హృదయానికి గుచ్చుకొన్నప్పుడు, అది ప్రతి ఒక్కరి హృదయంలో వున్న భయంకరుని నాశనం చేస్తుంది. ఆ భయంకరుడు ఎవరంటే మిధ్యాహం (అసత్య భావన). నేను దేహమును, నేను ప్రాణమును, నేను మనస్సును, నేను పురుషుడను, నేను స్త్రీని అని చేప్పే అసత్య భాషణము.

ప్రతి ఒక్కరి హృదయంలోనున్న ఈ అసత్య భావనే తీవ్రమైన రోగముల రూపంలో యుద్ధరూపంలో, టెర్రరిజం రూపంలో మరి ఇతర గ్రహచారముల రూపంలో ఇంకా ఇంకా ఇబ్బందిని కలుగచేస్తూ వున్నది. మనం అందరము సోదరులము. సోదరీ మణులము. కరుణామయుడైన తండ్రి బిడ్డలము, కాని లోకులు మతముల మధ్య అన్యభావములను సృష్టించుతూ వున్నారు. మరి పరస్పరము చంపుకొంటున్నారు. మరి యీ పవిత్రదినమున మీరు సర్వకాల సర్వావస్థలందును సమస్త సృష్టిని సేవిస్తూ వున్నవానికి ప్రణమిల్లుతున్నారు.

ఇది యుగములకు ఆఖరియుగం. ఆతని ఆవిష్కారము ఆతని నిర్యాణమనంతరము 100 సం॥ల లోపల సంభవిస్తుంది. మహత్తరమైనదిగా వుంటుంది. ఆతడు భౌతిక జీవితంలో వుండగా, ప్రియతముడు అనేకసార్లు ప్రజలందరిని కలిసికొంటూ, ప్రపంచం చుట్టునూ పర్యటించి వచ్చాడు. మస్తులతో పనిచేశాడు. కుష్ఠురోగులతో పనిచేశాడు. పిచ్చివారలతో పనిచేశాడు. పేదలతో పనిచేశాడు. అతడు గత అవతారములలో ఎన్నడూ ఇట్టి పనులు చేయలేదు. అతని ఆవిష్కారమునకు ప్రపంచమే రుజువు. అతడు భౌతికముగా భూమిపై వుండగా నిర్లక్ష్యం చేయబడినాడని గ్రహిస్తుంది. ఇది ఆతని ఎఱుకకు మార్గమును బహిరంగ పరుస్తుంది.

కనుక ప్రియమైన సోదరీ సోదరులారా! ధైర్యాన్ని కలిగి వుండండి. ఆతని





అభిమతమును అనుసరించేటందుకు తగిన శక్తిని కలిగి వుండండి. హృదయపూర్వకముగా ఆయనను జ్ఞాపకం చేసికొంటూ, మీ చేతల ద్వారా, తలంపుల ద్వారా మీ మాటల ద్వారా, మీ ప్రేమ ద్వారా నిజాయతీ ద్వారా, సేవ ద్వారా ఆయనను సంతోషపరచండి. మీ అందరూ నేడు ఆతని మెహెరాబాద్‌లో ఇప్పుడిక్కడ వున్నారు. లోకాన్ని, మీ కార్యకలాపాలన్ని మరచిపోయి ఇక్కడ వున్నారు. ఆతడు మీ శ్వాస కంటే సన్నిహితంగా మీతో కలిసి వున్నాడు. నేను ప్రియతమునిపై వ్రాసిన ఈ ప్రార్ధనను మీ అందరికీ ఇచ్చేటందుకు నాకు చాలా ఆనందంగా వున్నది

# ప్రార్ధన

హే! ప్రియతమ అవతార్ మెహెర్‌బాబా!

మా జీవితములో ఈ అమరతిథి యొక్క ప్రాధాన్యతను గుర్తింప చేయుము, శాశ్వతత్వమును చుంబించేటందుకు బంధముల నుండి కోర్కెల నుండి విడుదలగుటకు మేము తగిన ఉత్కంఠను కలిగి యుందుము గాక! భూత భవష్యత్తులను మేము మరచి పోయేటట్లు చేయుము.

కనుక శ్వాశతమైన నిత్యమైన వర్తమానములో స్థిరపడి వుంటాము. వర్తమానమునకు భూత భవిష్యత్తులు లేవు. ఎప్పుడూ నిత్య వర్తమానమే వున్నది.

హే! ప్రియతమా! నీ పావన చరణారవిందములపై ప్రణమిల్లజేయుము.

మేము శాశ్వత అమరతిథి విశిష్టతను అనుభవించి దానితో ఏకత్వమొంది **"సోహమ్"** నేను భగవంతునిగా వున్నాను అన్నట్టి స్థితిని అనుభవింతుముగాక!

ఓ ప్రభూ! మమ్ములను ఆపాదమస్తక రహితులను చేయుము. కాబట్టి మేము ఈ శాశ్వత తిథిలో సంస్థాపకులమై నీ యొక్క ఆ పాటను, ఆనాటి పాటను నిర్విరామముగా పాడుకొందుము గాక!

ఓ పరమేష్ఠీ! మేము మా యొక్క మిధ్యాహమును అడుగడుగుననూ నలిగి పోయేటట్లు నిన్నే అనుసరింతుము గాక! నీవే పరమ సత్యము. నీవే వున్నావు.

ఓ ప్రియతమ మెహెర్‌బాబా, మా బలహీనతలన్నింటిని క్షమించి మాపై నీ ప్రేమను వర్షింప చేయుము.

జయహో... జయహో, ప్రియతమ అవతార్ మెహెర్‌బాబాకీ జై.

నిండు ప్రేమతో జైబాబా **బాబా ప్రేమలో, బాబా సేవలో**

**వి.ఎస్. కల్చూరీ (భావూ)**

(గత సంచిక తరువాయి) స్వీయ చరిత్ర – ధారావాహికం

# మెహెర్‌బాబాతో నా జీవిత యాత్ర

# (My Life story with Meher Baba)

**LIVE FOR BABA**

*– కేశవ్ నారాయణ్ నిగం*

హమీర్‌పూర్ (ఉ.ప్ర)

**మహేవాలో....**

ఆ రోజు 1954 ఫిబ్రవరి 9.

నా స్వగ్రామం మహేవాలో బాబావారి రాత్రి బస ఏర్పాటు చేయడమైంది. 1952 నవంబరులో హమీర్‌పూర్‌కు తొలిసారిగా బాబా పర్యటించినప్పుడు బాబా బస కోసమని ప్రత్యేకంగా ఈ మహేవా గ్రామంలో ఓ చిన్న గుట్టపై అందమైన పర్ణశాలలాంటి నిర్మాణం చేపట్టాం. తిరిగి నేడు బాబా ఆ పర్ణశాలలోనే బస చేశారు. ఈ సమయంలో బాబా చాలా ఆనందంగా వున్నారు. ఆయన్ని చూడాలని వచ్చిన స్థానికులందరికీ దర్శనం ఇచ్చేందుకు అంగీకరించారు. **"నా పర్యటనలో ఆఖరి దర్శన కార్యక్రమంలో పాల్గొంటున్న మీరందరూ ఎంతో ధన్యులు"** అని బాబా వారిని ఉద్దేశించి అన్నారు. ఆ రోజు రాత్రి 9 గంటల నుండి తెల్లవారుఝూమున 4.30 దాకా, బాబాతోపాటు, మండలి వారందరూ స్థానిక బాబా ప్రేమికులందరూ మెళుకువగానే వున్నారు. ఆ రాత్రంతా బాబా ఎదుట ప్రేమికులు ఎన్నో భజనలు, కవ్వాలీలు ఆలాపించారు. మధ్య మధ్యలో బాబా అనేక ఆధ్యాత్మిక విషయాలు వివరించారు.

రాత్రి 12.50 నిముషాలకు అంటే ఆ రాత్రికి మొదటి గంట పూర్తవబోతుందనగా బాబా నన్ను తన ప్రక్కగా పిలిచారు. **"ఈ సమయంలో నీవు నా దగ్గరగా వుండటం నీ పూర్వజన్మ సుకృతం అని నీకు తెలియదు" అని బాబా నాతో అన్నారు. అంతా 'బాబా దయ' అని నేను నా రెండు చేతులు జోడించి నమస్కరించాను. ఆ సమ**యంలో బాబా చాలా ఆనందంగా కనిపించారు. మరికొద్ది సేపట్లోనే, బాబా తన ఒడిలోని అక్షర ఫలకంపై **'అవతార్ మెహెర్‌బాబాకి జై'** అని రాసి తన కుడిచేతిని జయ జయ నాదాల సంకేతంగా పైకి ఎత్తారు. ఈ అవతాకాలంలో తొలిసారిగా మహేవాలో బాబా తన అవతార ప్రకటీకరణ చేశారు. ఈ గ్రామంలోనే, తాను ఈ దేహం వదిలేశాక 700 సంవత్సరాలకు తిరిగి వస్తానని ప్రకిటించారు. మెహెర్‌బాబా తన అవతార ప్రకటీకరణ చేసిన ఈ కుగ్రామం, ఇక్కడి ప్రజలు ఎంతటి ధన్యులో సామాన్యులమైన మాకు ఏం అర్ధ మౌతుంది?





## మెహెర్‌బాబా షష్టి పూర్తి వేడుకలు – హమీర్‌పూర్‌లో –ఆంధ్రాలో

అంతేకాదు, **పార్శీ క్యాలెండర్** ప్రకారం 1954 జనవరి 10వ తేదిన అవతార్ మెహెర్‌బాబా 60వ జన్మదినమయ్యింది. ఆ సందర్భంగా అందరూ బాబాకు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందంతో భజనలు- కీర్తనలతో నృత్యం చేశారు. ఆ సమయంలో అక్కడవున్న వారందరికీ బాబా తన ఆలింగనం ఇచ్చారు. ఆఖరిగా తెల్లవారు ఝూమున 4.30 నిముషాలకు బాబా దర్శన కార్యక్రమం ముగిసింది.

## క్రొత్త జీవితం ప్రసాదించారు.

ఫిబ్రవరి 10వ తేదిన నా భార్య పరుగు పరుగున నా దగ్గరకు వచ్చింది. తన చెల్లెలు లలిత్ కిషోరి దేవి ఆఖరి క్షణాల్లో వుందని చెప్పింది. డబుల్ న్యూమోనియా- టైఫాయిడ్‌తో ఆమె కొంతకాలంగా బాధపడుతోంది. ఇక ఆమె బ్రతకడం కష్టం అని చెప్పి – స్థానిక డాక్టర్లు మందులు ఇవ్వడం ఆపివేశారు. నోటి మాట పడిపోయింది. తెరచిన కళ్ళు మూయడం లేదు.

ఆమె బాబాని ఎంతగానో ప్రేమిస్తుంది. ఆమె ఆస్థితిలో వుండి కూడా, ఎలాగైనా బాబాని దర్శించుకోవాలని చెప్పి ఇంటి నుండి బయల్దేరి, ఇంటిగుమ్మం దాటుతుండగానే క్రింద పడిపోయి అపస్మారకంలోకి వెళ్ళిపోయింది.

ఈ విషయాలన్నీ తెలుసుకున్న బాబా ఆమెను చూడటానికి మా యింటికి వచ్చారు. బాబా ఆమె నుదిట చేయివేసి స్పృశించారు.

ఆ తర్వాత బాబా బయటకు వచ్చి మాతో ఆమె చివరి క్షణం దాకా బాబా నామం స్మరించమని చెప్పమన్నారు. బైటకు బిగ్గరగా నామజపం చేయమన్నారు. నిస్సత్తువుగా వుంటే మనస్సులోనే బాబా నామం ఆపకుండా చేయమని సూచించారు.

నేను లోనికి వెళ్ళి ఆమెతో బాబావారి ఆదేశాల్ని చెప్పాను.

అలాగే బాబా నా తమ్ముడు దేవేంద్ర స్వరూప్‌తో ఏమన్నారంటే, ఆమెకు మందులు ఇచ్చేటప్పుడు బాబా నామం జపిస్తూ ఇవ్వమని సూచించారు.

ఆశ్చర్యం కల్గించే విషయమేమంటే మరణశయ్యపై వున్న లలిత్ కిషోరీ దేవి తిరిగి ఆరోగ్యవంతురాలైంది. ఆ తర్వాత చాలాకాలం ఆరోగ్యంగా మా అందరితో బాబా కార్యక్రమాలలో పాల్గొనింది. ఇది అవతారుడు ఆమెకు ప్రసాదించిన క్రొత్త జీవితంగా మేమందరం భావించాం. ఆ దరిమలా బాబా హమీర్‌పూర్ నుండి లక్నో వెళ్ళి, అక్కడ్నుంచి ముంబాయి రైలులో మెహెరాబాద్‌కు బయల్దేరి వెళ్ళారు.

లక్నో రైల్వే స్టేషన్‌లో బాబాకు వీడ్కోలు ఇచ్చే సమయంలో, నన్ను తన దగ్గరగా తీసుకుని, ఎంతో ప్రేమతో గట్టి ఆలింగనం ఇచ్చారు. హమీర్‌పూర్‌లో తన కార్యక్రమాలు చక్కగా జరిగాయనీ అన్నారు.

## మెహెర్‌బాబాతో రెండవ ఆంధ్రా పర్యటన

అనంతరం మెహెర్‌బాబా 1954 ఫిబ్రవరి 20 నుండి మార్చి 4 దాకా ఆంధ్రా పర్యటన చేశారు. ఆ పర్యటనలో పాల్గొనవల్సిందిగా నన్ను, నాతోపాటు మరో నల్గురుని హమీర్‌పూర్ నుండి ఆహ్వానించారు. ఆ మాదిరిగా మేం హమీర్‌పూర్‌లో ఫిబ్రవరి 18న బయల్దేరి, విజయవాడకు ఫిబ్రవరి 20వ తేది ఉదయాన్నే చేరుకున్నాం. విజయవాడలో మాకు వాసవీ కళ్యాణ మండపంలో మాకు బస ఏర్పాటు చేశారు. బాబా మండలివారికి కూడా ఇక్కడే ఇచ్చారు.

మెహెర్‌బాబా ఫిబ్రవరి 20 రాత్రి 8.30 నిముషాల సమయంలో విజయవాడకు పూనే ప్యాసింజర్‌లో వచ్చారు. ఆయనకు మాజేటి రామ్మోహన రావు గారింట బస ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 21 నుండి తెలుగు నాట అనేక గ్రామాలలో బాబావారి ప్రజాదర్శన కార్యక్రమాలు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆ ఆనందమయ సమయంలో అవతారునితో పాల్గొనే అవకాశం మాకు లభించింది.

**1954 ఫిబ్రవరి 25న, అవతార్ మెహెర్‌బాబా షష్టిపూర్తి-60 సంవత్సరాలు నిండిన సందర్భంగా వేడుకలు తాడేపల్లిగూడెంలో ఎంతో ఘనంగా జరిగాయి. తోట ధనపతిరావ్ నాయుడు గారింటి ముందు పెద్ద చలువ పందిర్లు వేయించారు.**

**అంతక్రితమే పార్శీ క్యాలెండర్ ప్రకారం 1954 ఫిబ్రవరి 10న హమీర్‌పూర్ జిల్లాలోని మహేవాలో బాబావారి 60వ జన్మదిన వేడుకలు మేం జరుపుకున్నాం. తిరిగి 1954 ఫిబ్రవరి 25న, ఆంధ్రాలో బాబావారి 60వ జన్మదిన వేడుకలు మరింత ఘనంగా వేడుకగా జరుపుకునే సందర్భంలో తిరిగి నేను హాజరవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.**

**మెహెర్‌బాబా హమీర్‌పూర్- ఆంధ్రాలను తనకు అత్యంత యిష్టమైనవని, హమీర్‌పూర్‌ను హెడ్ లాంటిదని, ఆంధ్రా తనకు హార్ట్ అనీ బాబా పలుమార్లు ప్రకటించారు. ఈ ప్రకటనల్లోని ఆంతర్యం బాబా ప్రేమికులకూ అవగతమే!**

ఆ తర్వాత గోదావరీ నదీ తీర ప్రాంతంలోని అనేక చోట్ల ఇచ్చిన ప్రజా దర్శన కార్యక్రమంలో పాల్గొనే భాగ్యం మాకు లభించింది. 1954 మార్చి 4న మహాశివరాత్రి





పర్వదినాన బాబా తన పర్యటనను కాకినాడలో ముగించారు.

## అవతారునితో ఉపవాసం

1954 జూన్ 23న జీవిత సర్క్యులర్ నంబర్ 19 ద్వారా బాబా జూలై 10 నాడు తన ప్రేమికులందర్నీ 24 గంటలపాటు మౌనం - ఉపవాసం పాటించమని ఆదేశించారు.

మెహెర్‌బాబాకు స్వయంగా తాను ఏడు రోజులపాటు - జూలై 10 నుండి 17 సాయంత్రం 6 గంటల దాకా ఉపవాసం ఉంటున్నట్లు ప్రకటించారు.

ఈ ఏడు రోజులూ బాబాతోపాటు ఆయన ప్రేమికులు ఏరుచ్, పెండూ, బైదుల్, సదాశివ, కేశవ నారాయణ్ నిగం, నానా ఖేర్, కనకదండి సూర్యనారాయణ మొత్తం ఏడుగురు ఆ ఏడు రోజులూ మౌనం, ఉపవాసం పాటించాలని బాబా సూచించారు.

ఈ మేరకు నాకు అంగీకారం తెలియజేయమని బాబా దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. అయితే ఈ అవకాశాన్ని అవతారుని ఆజ్ఞగా స్వీకరిస్తానని జవాబిచ్చి, మౌనం- ఉపవాసం బాబావారి ఆదేశాల ప్రకారం ఆ ఏడు రోజులూ నేను పాటించాను. ఐతే, ఆ దరిమలా, జూలై 10 తర్వాత మూడ్రోజులలోనే, మౌనం- ఉపవాసం ఆపివేయమని మా ఏడుగురికి తెలియజేస్తూ బాబా లేఖ పంపారు. తపాలాశాఖవారి పుణ్యమా అని, బాబావారి నుండి నాకు ఆ లేఖ జూలై 17న అందింది. ఆ కారణంగా నేను ఏడురోజులపాటు నా ఉపవాసం- మౌనం కొనసాగించాను. ఆ మాదిరిగా బాబావారి ఆదేశాలు పాటించే అవకాశం నాకు లభించింది.

## మెహెర్ పుకార్

1954 జూలై నుండి 'మెహెర్ పుకార్' హిందీ మాస పత్రిక ప్రచురణను ప్రారంభించాం. స్థానిక బాబా ప్రేమికులెందరో నాకు సహకరించారు.

## మెహెర్‌బాబాతో సమావేశం

1954 సెప్టెంబరు 29-30 తేదీలలో మెహెరాబాద్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు, హమీర్‌పూర్ ప్రేమికులందర్నీ ఆహ్వానిస్తూ వున్న జీవిత సర్క్యులర్ బాబా దగ్గర్నుంచి అందుకున్నాం. బాబావారి సూచనల మేరకు ఆ సర్క్యులర్ హమీర్‌పూర్ జిల్లా వాసులందరికీ తెలియజేసే బాధ్యత నాకు అప్పగించారు. ఆ మాదిరిగా హమీర్‌పూర్ నుంచి 162 మంది ప్రేమికులతో కలిసి మెహెరాబాద్ సమావేశానికి హాజరయ్యాను. ఈ సమావేశంలో ఎందరో పాశ్చాత్యులు అమెరికా, యూరోప్, ఆస్ట్రేలియా దేశాలనుండి హాజరయ్యారు. వారి సేవ, అంకితభావం క్రమశిక్షణ, బాబా ఎడల వారి

విధేయత చూశాక, మేం ఇంకా ఎంతో దూరం ప్రయాణించాలన్న సత్యాన్ని గ్రహించాను. ఈ సమావేశంలో మెహెర్‌బాబా ప్రకటించిన ఫైనల్ డిక్లరేషన్‌ని, అలాగే, బాబావారి సూచనలు, ఆదేశాలన్నింటినీ హిందీలో అనువాదం చేసే అవకాశాన్ని బాబా నాకు కల్పించారు. బాబావారి సందేశాలను, మౌనంలో ఆయన చేసే సంజ్ఞల ద్వారా నేను అర్థం చేసుకుని అనువదించి చెప్పడంలో, నాకు తెలియని ఆనందం, నా హృదయంలో చెరగని ముద్రవేశాయి. ఆ రెండ్రోజులు సమావేశానంతరం తిరిగి హమీర్‌పూర్‌కు విజయవంతంగా చేరుకున్నాం.

హమీర్‌పూర్‌లో బాబా కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నాం. పలుచోట్ల బాబా సెంటర్లు ఏర్పడినాయి. గతంలో గ్రామ గ్రామాన బాబా నామవ్యాప్తి కోసం పర్యటించేవాడిని, ఐతే పుకార్ పత్రికా నిర్వహణ, ఇతర బాబా కార్యాలయ పనులతో పని ఒత్తిడి అధికంగా వుండింది. మెహెర్‌బాబా కూడా ఇకపై గ్రామాల్లో పర్యటనలు తగ్గించి, ఆఫీసు పనులకు ఎక్కువ సమయం కేటాయించమని సూచించారు.

"If you prepare even one for me in the district as I want, then my work in the district will have been done" అని నాకు బాబా ముందుగా సూచించారు.

బాబావారి ఆదేశాల మేరకు నాకు నేనుగా బాబావారి ఇచ్ఛ ప్రకారం నడుచుకునే ప్రయత్నం నూటికి నూరు శాతం ప్రయత్నించడం ప్రారంభించాను. 1955 తొలినాళ్ళలో మెహెరాబాద్ నుండి హజ్రత్ బాబాజాన్ మరణానంతరం ఆమె తలవెంట్రుక నొకటి మాకు హమీర్‌పూర్ సెంటర్‌కు పంపారు. అవతారుని తొలి సద్గుర్వుణి బాబాజాన్ సంస్మరణార్థం మాకు ఆ జ్ఞాపికను పంపారు. మేం మా సెంటర్‌లో చాలా పదిలంగా భద్ర పరిచాం. అలా ఆమె తాలుకు జ్ఞాపక చిహ్నాలుగా మన దేశంలోను పాకిస్తాన్‌లోని ఓ ఆరు బాబా సెంటర్లకూ మెహెరాబాద్ నుండి పంపారు. మెహెరాబాద్‌లోనూ భావితరాల వారికోసం ఈ Relics ను భద్రపరిచారు. ఇదిలావుండగా 1955 మే ఒకటోతేదీ నుండి జూలై 31 దాకా సతారాలో బాబా కఠిన ఏకాంత వాసం లోనికి అడుగిడుతున్నారు. ఈ సందర్భంగా బాబా సూచనల మేరకు 1955 ఏప్రిల్ 24న ఓ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. బాబాకు అత్యంత సన్నిహితులైన పూనే, అహ్మద్‌నగర్, ముంబాయిలనుండి చాలా కొద్దిమందిని మాత్రం ఈ ప్రత్యేక సమావేశానికి ఆహ్వానించారు. కాగా, ఉత్తరాది నుండి నన్ను ఒక్కరినే ఈ సమావేశానికి హాజరు కావల్సిందిగా ఆహ్వానం నాకు లభించింది. బాబా మండలి వారందరితో కలిపి 1955 ఏప్రిల్ 24 నాటి ఈ సమావేశంలో పాల్గొన్నవారు కేవలం 36 మంది మాత్రమే. ఏకధాటిగా సుమారు 8 గంటలపాటు సాగిన ఈ ప్రత్యేక మీటింగులో మెహెర్‌బాబా ఎన్నో విశేష ఆధ్యాత్మిక విషయాలను తన ప్రేమికులకు అందజేశారు. భగవంతుని చేరుకునే మార్గం





గురించి స్పష్టంగా వివరించారు. అంతేకాదు మన మనస్సును అదుపులో ఉంచుకోవాలని, హృదయ భావాలకు ప్రాధాన్యత ఇవ్వాలని బాబా స్పష్టం చేశారు. మనస్సును నియంత్రించడం గురించి ప్రస్తావిస్తూ, తన కుడి చేతిని పైకి ఎత్తి పెట్టి, క్రమేణా దాన్ని కిందకు దించుతూ– మనస్సును గట్టి రాయిలా అదిమి పెట్టాలని, హృదయం యొక్క పరిధిలో పనిచేసేలా ప్రయత్నించాలని సూచించారు. మనస్సును దాని మానాన అది పరిభ్రమించేలా వదిలివేయరాదని పేర్కొన్నారు. ఈ మాటలు బాబా చెప్పే సమయంలో నా రెండు కళ్ళల్లోకి చూసినట్లు భావన కల్గింది. బాబా మాటల్ని నా నిత్య జీవితంలో అచరించడానికి కడదాకా ప్రయత్నించాను. అనంతరం, బాబావారి ఈ ఏకాంతవాసం పూర్తయ్యాక ప్రాంతాలవారీగా 1955 నవంబరులో నాలుగు గ్రూపులుకు మెహెరాబాద్‌లో బాబా సహవాస్ నిర్వహిస్తామని, ప్రకటించారు. మాది 'హిందీ భాషా గ్రూపు. పలువురికి తెలియజేసి– ఆసక్తిగల వారి నందరినీ ఈ సహవాస్‌లో పాల్గొనేందుకు ఆహ్వానించమని బాబా సూచించారు. నేను జిల్లా అంతటా బాబా ప్రేమికులందరికీ తెలియజేశాను. చాలా మంది తమ అంగీకారం తెలిపారు. సరిగ్గా మెహెరాబాద్ సహవాస్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బయల్దేరేందుకు రెండు మూడ్రోజుల ముందు నా భార్య తీవ్ర జ్వరంతో మూసిన కన్ను తెరవకుండా మంచంపైనే వుండింది. దాదాపు అపస్మారక స్థితిలో వుంది.

ఓ చెంప బాబా సహవాస్. నాతోపాటు ఎందరో ప్రేమికులను తోడుకుని వెళ్తున్నాను. మరో ప్రక్క భార్య అనారోగ్యం. నాది డోలాయమాన స్థితి. ఎటూ పాలుపోని క్షణంలో నా ముగ్గురు కుమార్తెలను ఆమెను జాగ్రత్తగా చూసుకోమని అప్పగించి, మన స్థితిలో లేని నా భార్య చెవిలో అంతా బాగవుతుంది. బాబా దయ. వెళ్ళి వస్తానని చెవిలో చెప్పి రైలు ఎక్కేసాను. సహవాస్‌లో బాబా సమక్షంలో మీ సమస్యలు– ఇంటి విషయాలన్నీ మరిచిపోయి– సహవాస్‌లో ఆనందంగా పాల్గొనమని బాబా భరోసా ఇచ్చారు.

"Baba Asked us there, to keep ourselves free from all worries, forget our home affairs and attend His Sahavas. I did so and left my worry about my wife illness to Baba.

నేను అలాగే తు.చ.తప్పక పాటించాను. బాబా సహవాస్ పూర్తయ్యాక, సంతోషంగా, ఇంటికి చేరాను. బాబా దయవల్ల నా భార్య ఆరోగ్యం కుదుటబడింది. ఐతే, అపాయకర అపస్మారక స్థితిలో, అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతున్న భార్యను వదిలిపెట్టి "బాబా" "బాబా"...అంటూ నేను వెళ్ళిపోయానని మా ఇరుగు పొరుగు వారు సూదుల్లాంటి మాటలతో నా మనస్సుకు తూట్లు పొడిచి గాయపరిచారు.

*(ఈ సీరియల్ ముగింపు వచ్చే సంచికతో......)*



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చురీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

***(గత సంచిక తరువాయి)***

రోజులు గడుస్తున్నాయి. కఫ్నీలోనే కన్పిస్తున్నాడు బైలీ. బాబావారు చెప్పారుగా రోజూ వేసుకోమని మొదట్లో బాగున్నట్లున్నా రోజులు గడుస్తున్న కొద్దీ దిగులు చుట్టుకోసాగింది. మాటలకు అందని మూగ బాధ అది. ఎందువల్ల? ఎందుకని? ఇవన్నీ చిక్కుప్రశ్నలు. అర్థాలు అంతర్ధానమయిన సమస్యలు. మధనపడ్డాడు. ఏమయింది బాబా! నేను ఏమి చేశాను? నీకు కోపం తెప్పించానా? అని తరచి తరచి ప్రశ్నించుకొన్నాడు.

అప్పుడు గుర్తుకువచ్చింది తన తప్పిదం. కొంటె కోణంగి బైలీ. వోసారి కరాచీలో ఏం చేశాడు.

బాబా మనిషినే కదా!

నాకూ ఆరతి ఇవ్వచ్చున్నాడు.

పాపం అక్కడి అమాయకులు బాబా బాల్య నేస్తానికి ఆరతి పట్టి, బాబావారికే ఆరతి పాడినంతగా ఉబ్బి పోయారు.

మన మిత్రుడు వాళ్ళ అమాయకత్వాన్ని చూసి ముసిముసి నవ్వులు నవ్వాడు.

మెహెరాబాద్‌లో ఇలా చేయలేదు కానీ, బాబావారి స్నేహితుడిని కాబట్టి నాకు అందరూ నీరాజనాలు పట్టాలన్నట్లు ప్రవర్తించేవాడు. ఎవరైనా మాటవినకపోయినా, ఇలాకాదు అలా చేయాలి అన్నా అగ్గి గుగ్గిలమయ్యేవాడు.

సర్వాంతర్యామికి తెలియనివి ఏముంటాయి కనుక.

అందుకనే బైలీని వో మెట్టు క్రిందకు దింపుదామని కఫ్నీ ఇచ్చారు.

కఫ్నీకాళ్ళకి అడ్డం తగిలి భోర్లా పడ్డాడు. తప్పు అయింది.

క్షమించు బాబా.

కఫ్నీ బారి నుంచి కాపాడు అన్నాడు.





చిరునవ్వుల వర్షం కురిపించి చిదానందమూర్తి ఏమన్నారో తెలుసా?

"అప్పుడేనా?

ఇంకా కొన్ని రోజులు వేసుకో.

కఫ్నీలో ఎంతో అందంగా వున్నావ్ అన్నారు.

ప్రేమమయుడికి అయ్యో పాపం అనిపించిందో ఏమో?

రెండుమూడు రోజులు పోయాక, బైలీకి కఫ్నీ నుంచి విముక్తి ప్రసాదించారు.

మౌనంగానే చెంపలు వేసుకొన్నాడు బైలీ."

ఇంకెప్పుడూ బాబాలా వుండే ప్రయత్నం చేయను.ఆధ్యాత్మికంగా ముందంజ వేసిన వాడిలా ఎవరితోనూ ప్రవర్తించను బాబా... బుద్ధి వచ్చింది. అనుకొన్నాడు.

బాబావారు రోజూ కూర్చొనే చోటుకి దగ్గరగా జూన్ 19వ తేదీన వుయ్యాల వేశారు. అందులో బాబా తరచు వూగుతున్నారు. ఒకసారి గాలిలోకి పైకి తేలిపోయి, క్రిందకి దిగి వస్తుంటే కలిగే ఆనందం, అది మాటలకి అందదు. నరుడికి అయినా పరాత్పరుడికి అయినా అదొక సరదా.

బాబావారిని చూస్తుంటే, అది సరదా కాదు మరేదో అంతార్థం వుందని మండలివారికి అనిపించింది.

ఎందుకంటే, వూయల పైకీ క్రిందకీ ఊగినట్లు ఆయన మొహ కవళికలు క్షణ క్షణం మారుతున్నాయి.

ఒక క్షణం సరదాగా కనిపిస్తే, ఇంకో క్షణం గంభీరంగా వుంటున్నారు. కాసేపు నవ్వుతూ వుంటే, మరి కాసేపట్లో రౌద్రమూర్తిలా కన్పిస్తున్నారు.

బాబావారిలో ఇన్ని మార్పులు ఎందుకబ్బా అన్న మీమాంసలో మండలివారు పడ్డారు.

జూన్ 20వ తేదీన మండలివారి క్వార్టర్లు రెడీ అయినై.

కొన్ని ఇళ్ళు పెద్దవి. మరి కొన్ని చిన్నవి. చెట్ల మధ్యన రెండు మూడు వరసల్లో ఇళ్ళు చూడ ముచ్చటగా వున్నాయని బైలీ వ్యాఖ్యానించాడు. ఎవరెవరు ఎక్కడ వుండాలి అన్న సమస్య తల ఎత్తలేదు. వీలుని బట్టి సర్దుకొన్నారు.

పెద్ద ఇళ్ళల్లో 12 నుంచి 15 మంది వరకూ సర్దుకొన్నారు. ఒక మోస్తరు ఇంటిలో ఏడుగురికి బస ఏర్పాటు చేసారు. మరి చిన్న ఇంటిని ఐదుగురుకి కేటాయించారు. కొన్ని ఇళ్ళలో ఆరుగురు కూడా వుంటామన్నారు. ఇలా మండలివారికి ఇన్ని రోజుల తర్వాత టోకాలో గూడు ఏర్పాటైంది.

జూన్ 21వ తేదీన బాబావారు ఆశ్రమం పిల్లలతో క్రికెట్టు ఆడారు. టోకా వచ్చాక ఇదే మొదటి క్రికెట్టు ఆట. బాబావారు బ్యాట్ పట్టి చాలా రోజులయినట్లనిపించింది.

మండలి నివాసానికి థాకే ఇల్లు కొంచెం దూరం అనాలి.

ఆయనది ఫ్యామిలీ క్వార్టరు.

టీచర్ల కుటుంబాలు కూడా ఈ క్వార్టర్లలోనే బస చేస్తున్నాయి.

21వ తేదీ మధ్యాహ్నం థాకే ఇంటికి విష్ణు వచ్చాడు.

టీకి రమ్మని ఆయన పిల్చాడు. ఇతగాడు వచ్చాడు.

ఈ సంగతి బాబాకి తెలిసింది. ఇద్దర్నీ నిలదీశారు.

అంతేనా, మండలికి కొత్త ఆర్డరు వేశారు.

"ఈవాల్టి నుంచి మీరెవ్వరూ ఫామిలీ క్వార్టర్లకి వెళ్ళ కూడదన్నారు.

స్త్రీ మండలి ఇంటి ఆవరణలో కూడా ఆడుగు పెట్టవద్దని హెచ్చరించారు.

ఈ సంగతిని నోటీసు బోర్డులో వ్రాయించారు.

ఆ మేరకు నోటీసులు అందరికీ పంపారు. చదవండి. చదవి చెప్పిన ప్రకారం నడుచుకోండి అన్నారు.

మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి ఎనిమిది వరకూ స్త్రీ మండలి క్వార్టర్ల వైపుకి ఎవరూ వెళ్ళకుండా కాపలా పెట్టారు.

ఈ బాధ్యతని రమ్జూ, మెహెర్జీలకి అప్పగించారు.

**(సశేషం)**






మీ ముంగిటకు

# మెహెర్‌బాబాను ఆహ్వానించండి

1. మెహెర్‌బాబా పత్రికకు జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలన్నది లక్ష్యం. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే బ్యాంకు అక్కౌంటులో జమచేయడమైనది.
4. వార్షిక సభ్యత్వం రూ.100/- ( నూరు రూపాయలు).మెహెర్‌బాబా పత్రికను చదవండి.. చదివించండి.. మీ బంధు మిత్రులందరికి పత్రికను పంపండి. మెహెర్‌బాబా పత్రిక ప్రతినెలా 19 లేదా 20వ తేదీ లోగా పోస్టులో పంపుతున్నాం. పత్రిక ప్రతి నెలా 25లోగా మీ ముంగిటకు వస్తుంది. మెహెర్‌బాబాను ఆహ్వానించండి.
5) మీ అడ్రస్సులో మార్పులూ చేర్పులూ ఎప్పటికప్పుడు యస్ యం యస్ ద్వారా తెలపండి. పోస్టల్ పిన్‌కోడ్ తప్పని సరిగా తెలియజేయండి.
6) బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500 087, ఫోన్: 99595-53218.**

## నమే భక్త ప్రణశ్యతి



అనితరసాధ్యమైన మెహెర్‌బాబా సందేశాలను వారి నిత్య జీవన విధానంలో అమలుచేసి ధన్యులైన బాబా ప్రేమికుల జీవనరేఖా చిత్రాలను ఈ గ్రంథంలో రేఖామాత్రంగా వివరించడమైంది. అందరూ మెచ్చిన ఈ పుస్తకాన్ని పలువురికి బహుమతిగా అందిచదగ్గ పుస్తకమిదని బాబా ప్రేమికుల అభిప్రాయం.

మీ స్నేహితులలో కొందరికైనా ఈ పుస్తకాన్ని అందజేయండి. పుస్తకాలను కొరియర్ సర్వీసులో పంపడమౌతుంది. ప్రతి ఖరీదు. రూ. 150. జైబాబా. మరిన్ని వివరాలకు మొబైల్.. 0995 955 3218 తో సంప్రదించండి.

# మంత్రవాది బాబాలో ఐక్యం



శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి (91) ఘోర రోడ్డు ప్రమాదంలో బాబాలో ఐక్యమయ్యారు.

మెహెరాబాద్‌లో 42వ అవతారుని అమరతిథిలో అవతారుడిని దర్శించుకుని, ఫిబ్రవరి ఒకటో తేదీన మెహెరాబాద్ నుండి కారులో తిరుగు ప్రయాణమయిన మంత్రవాది హైదరాబాద్ – షోలాపూర్‌ల నడుమ, హైదరాబాద్ నుండి సుమారు 250 కిమీ దూరంలో, జాతీయ రహదారికి ప్రక్కగా గల **ఉమర్‌గాం** గ్రామ సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు ఓ లారీని ఢీ కొట్టుకుంది.

సాయంత్రం 5.30 గంటల వేళ, జాతీయ రహదారిపై అడ్డంగా వచ్చిన గేదెలను తప్పించబోయి, మెయిన్ రోడ్డు దిగిన కారు, తిరిగి వేగంగా రోడ్డెక్కుతూ అక్కడే ఆగివున్న లారీని ఢీకొని, రెండు పల్టీలు కొట్టింది.

యం.బి. జి. శాస్త్రి గారి రెండవ కుమారుడు డా॥ యం. కైలాస్ డ్రైవింగ్ సీటులో వున్నారు. ఆయన ప్రక్కన ముందు సీట్లో శ్రీ మంత్రవాది కూర్చున్నారు. వెనుక సీట్లో యం బి జి గారి పెద్ద కుమారుడు శ్రీ ప్రసాద్, ప్రముఖ ఇ.ఎన్.టి. వైద్యులు డా॥ సి.ఇ.లక్ష్మీనారాయణ, ఎ.ఎస్.రావ్‌నగర్ వున్నారు.





ఈ ప్రమాదంలో శ్రీ మంత్రవాదికి డా॥ లక్ష్మీనారాయణగార్లకు పెద్దగా గాయాలు తగలేదు.

కానీ మంత్రవాది బాగా షాక్ తిన్నారని శ్రీ ప్రసాద్ చెప్పారు.

అంతక్రితమే గుండె సంబందిత వ్యాధితో బాధపడుతున్న మంత్రవాదికి ఈ దుర్ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

రోడ్డు ప్రమాదం జరిగాక స్థానికుల సహాయంతో ఉమర్‌గాంలోని స్థానిక ఆసుపత్రిలో ప్రాధమిక చికిత్స తీసుకున్న శ్రీ మంత్రవాది, కోలుకుంటున్నారన్న సమయంలోనే శ్రీ ప్రసాద్‌ని దగ్గరగా పిలిచి, **“ ఇక అయిపోయింది రా!! నేనెళ్ళిపోతున్నానని– తన మరణాన్ని ముందుగానే మంత్రవాది పసిగట్టారు**. కాగా, ప్రసాద్ డాక్టర్లుని పిలిచి– చాతీపై గట్టిగా శక్తిని పెట్టి కృత్రిమ శ్వాస అందించే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. పిదప, శ్రీ మంత్రవాది బాబాలో ఐక్యమయ్యారని వైద్యులు ప్రకటించారు.

డా॥ కైలాస్, ప్రసాద్‌లకు నుదిటి భాగంలో, కంటి దగ్గరా బలమైన గాయాలయ్యాయి. వారు ప్రయాణించిన క్రొత్త కారు నుజ్జయింది. ఫిబ్రవరి 2వ తేదీ, సాయంత్రం 4 గంటలకు, వారి కుమారులు వారి కుటుంబ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు.

శ్రీ మంత్రవాదిని అమితంగా అభిమానించే గుంటూరు సెంటర్ బాబా ప్రేమికులు శ్రీ కనకయ్య గారు, శ్రీ బి. సుబ్బారావు గారి కుటుంబసభ్యులు పలువురు హుటాహుటిన హైదరాబాద్‌కు చేరుకున్నారు.

గుంటూరు బాబా సెంటర్ ప్రధాన నిర్వాహకులు శ్రీ బి.సుబ్బారావు, శ్రీ మంత్రవాది ఇద్దరూ ప్రియ మిత్రులు అని చెప్పాలి. ఒకరంటే మరొకరికి అమితమైన ప్రేమానురాగాలున్నాయి.

శ్రీ సుబ్బారావు కూడా ఫిబ్రవరి ఒకటో తేదీన బాబాలో ఐక్యమయ్యారని గుంటూరు సెంటర్ ప్రేమికులు వారిని స్మరించుకుని నివాళులు అర్పించారు.

నిరంతరం బాబా నామస్మరణలో గడిపిన మంత్రవాది బాబా ప్రేమికులందరికీ చిరస్మరణీయులే.

ఈ సంచికలో మంత్రవాది గారి స్మృత్యర్థం వారు రాసిన మధురమైన రెండు గీతాలు మెహెర్‌బాబా పాఠకులకోసం ప్రత్యేకంగా ప్రచురిస్తున్నాం. పరిశీలించగలరు.

## 2011 మార్చి సంచికలో

**మెహెర్‌బాబా సన్నిధిలో మంత్రవాది గారు గడిపిన మధుర క్షణాలపై సుమారు నాలుగైదేళ్ళనాడు మా ప్రతినిధికి ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూని పరిశీలించండి. ఇదొక అరుదైన సమాచారం. వచ్చే సంచిక కోసం ఇప్పటి నుండే ఎదురు చూడండి!!**



# జయ జయ జయ

-మంత్రవాది శ్రీరామమూర్తి

జయ జయ జయ మెహెరుబాబా
జయ బాబా జయము జయము ॥జయ॥

యుగ యుగాన నవతరించు
మాయా మానుషవేష ॥జయ॥

నీ రూపమే రమణీయము
నీ నామమె స్మరణీయము
నీ వీక్షణె మాకు రక్ష
నీ బంధమె మా మోక్షము ॥జయ॥

ఆవేదన లంతరించి
ఆనంద మ్మతిశయించు
పెనుతుఫాను నీ ప్రేమై
అభముతొలగు శుభము కలుగు ॥జయ॥

అహంభావ మణగిపోవు
స్వార్ధము నిస్వార్ధమౌను
ప్రతి ఆత్మ పరమాత్మగ
ముజ్జగాలు మేలుకొనును ॥జయ॥

జయము జయము నినుకొలిచిన
జయము జయము నినుపిలిచిన
నినుతలచిన నినువలచిన
జయము జయము జయము నిజము ॥జయ॥





# నమోస్తుతే

-మంత్రవాది శ్రీరామమూర్తి

**కురంజి ... శంకరాభరణం రూపక**

ఓం నమోస్తుతే సద్గురు వందితాయ
నిరంతర నందితాయ
వ్యక్తా వ్యక్తాయ శాశ్వతాయ
ఆద్యంతరూప గుణనామ వర్ణ రహితాయ
స్థితాయ, హితాయ, జగద్దితాయ

నమోస్తు అభయంకరాయ శుభంకరాయ
వేణీ ధరాయ ప్రేమ గంగాధరాయ
పూర్ణావతారాయ అర్ధనారీశ్వరాయ
మెహెరాయ, హరాయ, మనోహరాయ.
నమోస్తుతే పరమకారణ కారణాయ
సంసార కారణ వారణాయ
లోక త్రయార్తి హరణాయ
మందస్మిత భుషణాయ మౌనభాషణాయ.

"అహం" "మమే"తి దుర్వార భవవ్యాధిఛేదకాయ
అబోదకాయ అవబోదకాయ
భక్త హృద్‌క్షేత్ర దివ్యకర్షకాయ
నమోస్తు హర్షకాయ, ప్రేమవర్షకాయ.

ఆవేద ఇవ ఆశక్త ఇవ జడవతు మౌనవేషణాయ
త్రివిధ భూషణాయ
ధూళిమివ శిష్యగణ శోషణాయ
తోషణాయ మస్త్ పోషణాయ
నమోస్తు భవనాటక ఖేలనాయ,
మమ పాలనాయ నమః

# యాద్ రఖ్



ఆమె ఓ హైదరాబాదీ బాబా ప్రేమికురాలు.

పేరు శ్రీమతి కె. విజయలక్ష్మి.

శ్రీ కనిగిరి చంద్రకాంత్ గారి భార్య. వారు చాలాకాలంగా బాబా సేవలో వున్నారు. పలువురి బాబా ప్రేమికులకు వారు బాగా పరిచయస్థులు.

ఇటీవల 42వ అమరతిథిలోని ఓ సందర్భాన్ని, హైదరాబాద్ – కోఠి సెంటర్‌లో, ఆమె ఇలా వివరించారు.

**ఇకపై ఆమె మాటల్లోనే......**

నేను ఎప్పటిలా ఈ ఏడాది కూడా వాలంటీరుగా మెహెరాబాద్‌కు వెళ్ళాను.జనవరి 31న అమరతిథినాడు వాలంటీర్లు బాబాని దర్శించుకోరాదన్నారు కదా. అందుకని, ఆ రోజున నాకు డ్యూటీలేని ఖాళీ సమయంలో, బాబా సమాధి దగ్గర మౌనంగా, అవతారుని సమాధిని చూస్తూ, బాబా నామం చేసుకుంటూ ఒంటరిగా నిలుచున్నాను.

సమాధి ప్రాంతానికి వచ్చేటప్పుడే దిగువ మెహెరాబాద్ నుండి ఓ పూలదండను, బాబా ప్రసాదంగా చాక్లెట్ల ప్యాకెట్ నొకదాన్ని కొనుక్కొచ్చాను. అది చేతిలో వుంచుకుని సమాధికి ఎదురుగా నిలుచున్నాను.

నేనెలాగూ బాబాకు ఈ దండను వేయలేను. నాకు సమాధిలోనికి అనుమతి లేదు .

కనీసం ఈ పూలదండను బాబాని దర్శించుకునేందుకు వెళ్ళేవారికెవరికైనా ఇస్తే బాగుంటుందని, అలాగే చాక్లెట్ల ప్యాకెట్‌ను వారికిస్తే బాబా ప్రసాదంగా బాబా చెంత వుంచి తీసుకువస్తారు కదా అని, తెలిసిన వాళ్ళ కోసం ఎదురుచూస్తున్నాను.

బాబా ఎవరిని పంపితే వారికి పూలదండను ఇద్దామని మనస్సులో అనుకుంటూ నిలుచున్నాను.

కొన్ని క్షణాలు అలా గడిచాయి. ఇదుగో ఇంతలో శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి గారు బాబా దర్శనం కోసం వెడుతూ నాకు కనిపించారు.

వెంటనే ఆయనికి జైబాబా చెప్పి, నా చేతిలోని పూలదండను, చాక్లెట్లను వారి చేతిలోపెట్టి, నా తరఫున బాబాకు సమర్పించమని కోరాను.

ఆయనెంతో సంతోషించారు. ఆ తర్వాత బాబాని దర్శించుకుని వచ్చి నాకు జైబాబా





చెబుతుంటే, అప్పుడు ఆయనకు నా పరిస్థితి గురించి చెప్పాను.

అమరతిథినాడు బాబాకు ఓ పూలదండ కూడా వేయలేకపోతున్నానని, కనీసం ఎవరైనా తెలిసినవారి ద్వారా పూలదండను బాబాకు సమర్పించాలని ఎదురుచూస్తుంటే బాబా పంపినట్లు మీరు వచ్చారని, జైబాబా చెప్పాను.

ఇందుకు ఆయనేమన్నారో తెలుసాండి....

అమ్మా... నా గురించి చెప్తాను విను... నేనూ దాదాపుగా అదే పరిస్థితిలో వున్నానన్నారు. అవతారుని అమరతిథి.

ఒక్క పూలదండ కూడా చేతిలో లేకుండా వస్తున్నాను.

కొందామన్నా దరిదాపుల్లో ఎక్కడా లేవు.

పూలదండ కావాలంటే ఎక్కడో చాలా దూరం.. దిగువ మెహెరాబాద్ దాకా వెళ్ళాలి. ఇప్పుడంత సమయం లేదు. ఏమి నా పరిస్థితి అని చింతుస్తున్న తరుణంలో ...

ఇదిగో ..అమ్మా..నీవు కనబడి, పూలదండ ఇచ్చావు.

దాన్ని తృప్తిగా అవతారునికి అందజేశాను.

చాలా ఆనందంగా వుందని, నన్ను ప్రేమగా దీవించి, బాబా ప్రసాదం చాక్లెట్ల ప్యాకెట్‌ను తిరిగి నాకిచ్చారు.

ఆ తర్వాత బాబా ప్రేమికులతో కలిసి ఆయన అలా ముందుకు వెళ్ళిపోయారు.

ఆయనకు బాబా ప్రసాదంగా ఓ చాక్లెట్ ఇద్దామని ప్రయత్నించాను.

కానీ అయన అప్పటికే చాలా దూరం వెళ్ళిపోయారు.

హైదరాబాద్‌కు తిరిగి వచ్చాక, ఆయనకు జరిగిన కారు ప్రమాదం గురించి తెలిసింది. ఎంతో బాధపడ్డాం.

మహానుభావుడు...ఆనందంగా అవతారునిలో లీనమయ్యారు.

ఆయనకు బాబా ప్రసాదం ఇవ్వలేక పోయాను అని చెప్పి, ఫిబ్రవరి 5న, శనివారం కోఠి సెంటర్‌లో స్థానిక బాబా ప్రేమికులందరికీ ఆ ప్రసాదం శ్రీమతి విజయలక్ష్మి అందజేశారు.

❀

# పత్రిక సభ్యత్వం

గత కొన్ని సంచికల ద్వారా ముందుగా తెలియజేసినట్లు, మెహెర్‌బాబా పత్రికకు 2008, 2009 నుండి వార్షిక సభ్యత్వం చెల్లించని వారి చిరునామాలను తొలగించడమైంది. కావున వారికి ఫిబ్రవరి 2011 సంచికలు బట్వాడా కావని తెలియజేయడమైంది.

**– సర్క్యులేషన్ విభాగం**

**క్రొత్త పుస్తకాలు.**

# DIVINE THEME

Divine Theme with charts and an Introduction to the 2nd Edition- by Meher Baba అనే చిన్న పుస్తకాన్ని 2011 ఫిబ్రవరి 28న మెహెరాబాద్‌లో బాబా ప్రేమికులు కోసం ప్రత్యేకంగా విడుదల చేసినట్లు శ్రీ యం.వి.ఆర్.కె. బాలాజీ అన్నారు. మెహెర్‌బాబా Evolution, Reincarnation, Realisation అనే అంశాలపై అందమైన రెండు రంగుల చార్టులలో సవివరంగా వివరించారు. ఈ ప్రచురణ 1940 దశకం నాటిది. 1943 మే 14న మెహెర్‌బాబా 125 మంది పురుష ప్రేమికులను ఐదురోజుల ప్రత్యేక సహవాస్‌లో పాల్గొనేందుకై మెహెరాబాద్‌కు ఆహ్వానించారు. ఈ సహవాస్‌లో మే 17న ఈ చార్టుల ప్రాముఖ్యత గురించి మెహెర్‌బాబా తన ప్రేమికులకు సవివరంగా వివరించారు. ఈ చార్టుల్ని, అంతక్రితం ఓ నెలరోజుల మునుపే, పాశ్చాత్య బాబా ప్రేమికురాలు, ప్రముఖ చిత్రకారిణి శ్రీమతి రానో గెల్లీ బాబా సూచనల మేరకు ఈ చార్టుల్ని రూపొందించింది. కాగా, తర్వాత అదే సంవత్సరం బాబావారి కార్యదర్శి శ్రీ ఆదీ.కె.ఇరానీ ఈ చార్టులు- మరిన్ని వివరాలతో ఓ 18 పేజీల పుస్తకాన్ని ప్రచురించారు. 1955లో గాడ్ స్పీక్స్ ప్రచురణ సమయంలో ఈ రెండు చారులను ఆ గ్రంథంలో **డివైన్ థీమ్** అంశంలో పేజి 220-228 లలో ప్రచురించారు. ఐతే, నాటి ఈ పుస్తక ప్రచురణ ప్రతులు నేడు అలభ్యం. వీటిని బాబా ప్రేమికులందరికీ అందుబాటులో వుంచాలన్న ఉద్దేశ్యంతో - ఆనాటి మధుర భావాలు తిరిగి ఉద్దీపన చెందేలా, 1943 నాటి ఒరిజినల్ ప్రచురణను సరిపోల్చుతూ దాదాపుగా అదే సైజు, డిజైన్‌లలో ఎలాంటి మార్పులు చేర్పులు లేకుండా తిరిగి పునర్ముద్రణ చేపట్టినట్లు ట్రస్టువారి తరపున అమెరికా దేశీయుడు **వార్డ్ పార్క్** ఈ పుస్తకంలోని ముందుమాటలో తెలియజేశారు. పుస్తకం వెల రూ.50/-. **ప్రాప్తి స్థానం**- అవతార్ మెహెర్‌బాబా కోఠి సెంటర్, ఈసామియా బజార్, హైదరాబాద్. అలాగే శ్రీ యం.వి.ఆర్.కె. బాలాజీ, ఫోన్-9849090417 040-24566516 సంప్రదించగలరు.








# గణపతిరావు బాబాలో ఐక్యం

హైదరాబాద్ కోఠి సెంటర్‌లో ప్రతి శనివారం సాయంత్రం 6 నుండి 8 గంటల దాకా బాబా సత్సంగ్ జరుగుతుంది. ఈ విషయం అందరికీ తెలిసిందే. ఈ సత్సంగ్‌కు వచ్చినవారిని ప్రేమతో పలకరించే ఇద్దరు పెద్దలు శ్రీ పి. గణపతి రావు, శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి, ఎవరి ఊహకు అందని రీతిలో ఆకస్మికంగా, భౌతికంగా కనుమరుగయ్యారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి శనివారం కోఠి సెంటర్‌లో బాబా సన్నిధిలో కలిసే వీరు ప్రస్తుతం బాబా ప్రేమికులకు దూరమయ్యారు.



శ్రీ పి. గణపతిరావు 2011 జనవరి 22, శనివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో బాబాలో ఐక్యమయ్యారు. ఆయనకొంతకాలంగా శ్వాస సంబంధ వ్యాధితో బాధపడుతూ స్థానిక ఆసుపత్రితో చికిత్సచేయించుకుని డిశ్చార్జయి ఇంటికివచ్చిన రెండు మూడురోజులకే అనుకోనిరీతిలో తుదిశ్వాస విడిచారు. శ్రీ గణపతి రావు నిరాడంబరంగా, మౌనంగా, నవ్వుతూ అందరినీ ప్రేమగా పలకరించేవారు. ఏదైనా విషయంపై తాను చెప్పదల్చుకున్న విషయాలను సూటిగా, నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా చెప్పేవారు. ముఖస్తుతి మచ్చుకైనా ఉండేది కాదు. మెహెర్‌బాబా సాహిత్యాన్ని బాగా చదివి, ఆకళింపు చేసుకున్న వ్యక్తి శ్రీ గణపతి రావు. మెహెర్‌బాబా తన ప్రేమికులకు ఇచ్చిన **'బాబా ఇచ్ఛపై'** ఆయన తరచు తమకు వివరంగా చేప్పేవారని అయన సన్నిహితులు గుర్తుచేసుకుంటారు. బాబా ఇచ్ఛను స్మరిస్తూ, అనుక్షణం బాబా నామ స్మరణలో జీవనం గడిపిన శ్రీ గణపతి రావు ధన్యులు.

వీరి ఏకైక కుమారుడు శ్రీ రాజేంద్ర మెహెర్, జూబ్లి బాబా సెంటరు కార్యదర్శిగా గత కొంతకాలంగా విశేష సేవలు అందజేస్తున్నారు.

## చల్లపల్లి

అవతార్ మెహెర్‌బాబా వారి 117వ జన్మదినోత్సవం సందర్భంగా 1.2.2011 మంగళవారం నుండి 25.02.2011 శుక్రవారం వరకు 25 రోజులు పలువురు బాబా ప్రేమికుల గృహములలోను మరియు సెంటరు ప్రార్ధనా మందిరములోను బాబా భజనలు, ప్రార్ధనలు, మౌనము, ఉపన్యాసములు, హారతి మొదలగు కార్యక్రమములు నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు.

## ఏలూరు

అవతార్ మెహెర్‌బాబా వారి జన్మదిన వేడుకలు 05.02.2011 శనివారం నుండి 25.2.2011 శుక్రవారము వరకు ఏలూరు పట్టణములోని మెహెర్ నిలయము నందు మరియు ఏలూరు పట్టణములోని పలు ప్రాంతములలో గల బాబా ప్రేమికుల గృహములందు నిర్వహించినట్లు శ్రీ యు. బాపిరాజు ఆహ్వానం పంపారు. అలాగే నగర సంకీర్తన ఉదయం 5.30 నుండి 7 వరకు, సాయంకాలము సహవాస్ 6 గంటల నుండి రాత్రి 8 వరకు సంకీర్తనలు, అవతారుని సత్య ప్రేమ సందేశముల మననము చేయుట జరిగిందని ఆయన తెలిపారు.

## శ్రీకాకుళం సెంటర్

అవతార్ మెహెర్‌బాబా 117వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జనవరి 1వ తేదీనుండి వివిధ ప్రేమికుల గృహములందు సంకీర్తనా కార్యక్రమములు నిర్వహిస్తున్నాము. ఈ సందర్భముగా 100 మంది పేదలకు, మానసిక వికలాంగులకు, లెప్రసీ కాలనీ వాసులకు దుప్పట్లను పంపిణీచేయడమైనది.

నేత్ర వైద్య నిపుణులు డా॥ పి.ఎల్.ఎన్.రాజు, డా॥ కె.ఎల్. నాయుడు సుమారు 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి, 26 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడమైనదని కార్యదర్శి శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

## కేంద్ర మార్గదర్శిని

తెలుగునాట గల పలు బాబా సెంటర్ నిర్వాహకులు తమ బాబా సెంటర్ భవనం యొక్క లోపల, బయట రెండు ఫోటోలను అందముగా తీయించి, ఆ సెంటర్ ఎప్పుడు స్థాపించబడింది, ప్రాముఖ్యత, చిరునామా, ఫోను నెంబరు మరియు వారంలో ఏ రోజున సంకీర్తన సమావేశములు జరుపుతున్నారు. అలాగే ఈ మెహెర్ సెంటర్ రైల్వేస్టేషన్, బస్సు స్టేషన్‌లకు ఎన్ని కిలోమీటర్ల దూరంలో ఉందో వివరంగా రాసి ఫోటోలను జతపరచి పంపవల్సిందిగా శ్రీ వల్లూరి నాగేశ్వరరావు కోరుతున్నారు.





ఈ వివరాలన్నింటినీ అవతార్ మెహెర్‌బాబా కేంద్రమార్గదర్శిని పేరిట గ్రంథస్తం చేయనున్నామని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు మెహెర్‌శ్రీ స్పిరిచ్యువల్ పెన్ ఫౌండేషన్, వల్లూరి నాగేశ్వరరావు,డోర్ నెం.10-1-61, మెహెర్‌నగర్, పాత గాజువాక, విశాఖపట్నం - 530 026. సెల్-9948281785 తెలియజేయవల్సింది.

## కరీంనగర్‌లో

అవతార్ మెహెర్‌బాబా 117వ జన్మదిన శుభ సందర్భముగా 1.2.2011 నుండి 25.02.2011 వరకు కరీంనగర్ పట్టములో ప్రతిరోజు రా॥ 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు బాబా ప్రేమికుల గృహములలో సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు.

## వివాహం

రెంటాల నర్శింహమూర్తి, శ్రీమతి సుందరి గార్ల పుత్రిక చి॥ ఆదిత్య మెహెర్ వివాహము చి॥ల॥సౌ॥ లక్ష్మీ ప్రసూనతో శ్రీ పరిమి రామారాయుడు మరియు రత్తమ్మ కళ్యాణవేదిక, కొవ్వూరులో 08.02.2011, రాత్రి గం॥1.12 ని॥లకు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

## కొమరిపాలెం

తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురం కేనాల్ సమీపంలో గల కొమరిపాలెంలో శ్రీ వాసంశెట్టి రవి, కటుంబసభ్యుల ఆధ్వర్యంలో చక్కని బాబా సహవాస్ జనవరి నెలలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రంలో ఆర్. బాణేశ్వరరావు, కె.నారాయణరావు, మల్లిపూడి పనసన్నలు శ్రీ జి.ఎస్. ప్రకాశరావు (శ్రీకాకుళం), స్థానిక వైద్యులు శ్రీ పి.ఎల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇకపై ప్రతి ఏడాది జనవరి మాసంలో పెద్ద ఎత్తున బాబా సహవాస్ కార్యక్రమాలు ఈ గ్రామంలో నిర్వహించాలని నిర్ణయించారని శ్రీ రవి తెలిపారు.

## విశాఖలో

విశాఖ శివార్లలోగల మారిక వలస గ్రామంలో - రాజీవ్ గృహకల్ప కాలనీ ప్రాంగణంలో విశాఖ బాబా సెంటర్ ప్రేమికులు 2011 జనవరి 23న సహవాస్ నిర్వహించామని కార్యదర్శి శ్రీమతి విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అవతార్ మెహెర్‌బాబాకీ జై అని సుమారు 600 గృహ సముదాయాలపై పెయింట్ చేయించినట్లు ఆమె తెలిపారు. బాబా చలన చిత్ర ప్రదర్శనతో పాటు భజనలు, ప్రార్ధనలు, ఆరతి నిర్వహించామని సుమారు 200 మంది స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారని శ్రీమతి విజయలక్ష్మి తెలిపారు.

## భరూచా కథనం

# ఇంతేకదా ....

ఒక పర్యాయం డాక్టర్ భరూచా మెహెరాజాద్‌లో బాబా వద్ద ఉన్నారు.

ఆయన వచ్చిన పని అయిపోగానే, తన స్వగ్రామం - నవసారీ వెళ్ళబోయే ముందు బాబా దగ్గర శెలవు తీసుకుందామని బాబా చెంతకు వచ్చాడు.

అప్పుడు బాబా ఏమన్నారంటే....

**బాబా** : భరూచా! నీవు ఇంటికి వెడుతున్నావు. నేనొక పని చెబుతాను. చేస్తావా? అని ప్రశ్నించారు.

**భరూచా** : తప్పకుండా చేస్తాను బాబా అన్నాడు.

**బాబా** : మాట తప్పవు గదా మరి.

**భరూచా** : నా శాయశక్తులా ప్రయత్నిస్తాను బాబా.

**బాబా** : మరేం లేదు. నీవు ఇంటికి వెళ్లిన తరువాత మూడు నెలలు నవసారీ వదిలి ఎక్కడికీ వెళ్ళకూడదు. ఊళ్ళోనే వుండాలని ఆదేశించారు.

**భరూచా** : అలాగే బాబా. ఇంతే కదా. తప్పకుండా అని భరూచా నవసారీకి వెళ్ళిపోయాడు.

భరూచాకి బొంబాయిలో **బబ్లీ** అనే ఒక సోదరి వుంది. ఆమె బాబా ప్రేమికురాలు. ఆమె భర్తకు బాబా అంటే అంత ఆకర్షణ లేదు. ఆమె కాపురం అంత సుఖంగా ఉందని చెప్పడానికీ లేదు.

ఒకరోజున ఆమె ఆరోగ్యం బాగాలేదని, వచ్చి ఆమెను తమతో తీసుకు వెళ్ళవలసిందని భరుచాకి ముంబయి నుంచి కబురు వచ్చింది.

బాబా ఆజ్ఞ ప్రకారం భరూచా స్వగ్రామం వదలి వెళ్ళడానికి వీల్లేదు కదా.

భరూచా తన తల్లిని పంపుదామనుకుంటే ఆమె అరోగ్యం అంతంతమాత్రంగా వుంది.

ఇంతలో ముంబాయి నుంచి భరూచా సోదరి బబ్లి ఆత్మహత్య చేసుకుందని చెబుతూ మరో టెలిగ్రాం వచ్చింది.

భరూచాకు ఓ చెంప బాబావారి ఆదేశాలు.

మరో ప్రక్కన రక్తసంబంధం. ఏం చేయాలో పాలుపోని స్థితి.

ఇంట్లో ఉండలేక పోతాడు.

విషమ పరిస్థితి. "ఏమయినసరే... నేను బయలుదేరలేను.

కాబట్టి నీవే వెళ్ళి రావల్సిందని తన తల్లిని మరొకరి సహాయం అర్థించి ప్రయాణానికి సిద్ధం చేశాడు.

**బాబా కూడా తెగే దాకా లాగరు. ఇలాంటి అస్తవ్యస్థ పరిస్థితుల్లో తన ప్రేమికుని విధేయతకు భంగం వాటిల్లుతుందన్న పరిస్థితుల్లో అవతారుడు ఆదుకుంటారని బాబా ప్రేమికుల నమ్మకం.**





అదే జరిగింది భరూచా విషయంలో కూడా...

"ఈ పరిస్థితిలో నీవు నవసారి నుండి వెళ్ళడానికి బాబా అనుమతిస్తున్నారని మండలివారి నుండి భరూచాకి టెలిగ్రాం అందుతుంది.

ఆ దరిమలా, తల్లితో పాటు ముంబాయి వెళ్ళారు...

ఆ తర్వాత మరణించిన తన చెల్లెలు భర్త కూడా బాబాని దర్శించుకున్నాడు.

బాబా ప్రేమికుడయ్యాడు.

## క్రొత్త పుస్తకావిష్కరణ

# AWAKENINGS

మెహెరాబాద్‌లో అమరతిథి వేదికపై జనవరి 31న మెహెర్‌బాబా ట్రస్టు ఛైర్మన్ భావూ కల్చూరీ (భావూజీ) రాసిన AWAKENINGS క్రొత్త పుస్తకాన్ని, బాబా ప్రేమిక లోకానికి విడుదల చేశారు.

2001లో బావూజీ గుండెకు బైపాస్ ఆపరేషన్ చేశారు.

ఈ శస్త్ర చికిత్స తర్వాత బాగా కోలుకున్నాక, అవతారుని సన్నిధానంలో అవతారునితో భావూజీ నెరిపిన సంబాషణల కూర్పు ఈ గ్రంధానికి మూలమని రచయిత పేర్కొన్నారు.

భావూజీ దాదాపుగా ప్రతిరోజు రాత్రిపూట మెహెర్‌బాబాతో అనేక విషయాలపై మాట్లాడారు. అవతారునితో ఈ మాటా మంతీ సుమారు ఓ ఏడాది పాటు కొనసాగింది.

చివరిగా, **నేను ఈ శరీరాన్ని కాదు గుర్తుంచుకో**

**"Yad Rakh", I am not this body** అన్న సందేశం తర్వాత తాను అనుభవించిన అవేకనింగ్ పూర్తయిందని భావూ పేర్కొన్నారు.

429 పేజీలలో గల ఈ గ్రంధాన్ని మెహెర్ నజర్, అహ్మద్‌నగర్ వారు ప్రచురించారు. ఖరీదు రూ. 700/-. అహ్మద్‌నగర్‌లోని ట్రస్టు ఆఫీసు ప్రాంగణంలో గల మెహెర్ నజర్ పుస్తకాల భండాగారంలో ఈ పుస్తకం లభిస్తుంది.

**AWAKENINGS** అంటే **ముందస్తు హెచ్చరిక, లేదా మేలుకొలుపు** అని తెలుగులో సమానార్థంగా చెప్పుకోవచ్చు.

అవతారుడు భావూజీ ద్వారా తన ప్రేమికులందరికీ అందించిన ప్రేమ సందేశంగా ఈ గ్రంథంలోని అంశాలను భావించాలి.

పుస్తక ఖరీదు దృష్ట్యా సగటు పాఠకులకి కాస్తంత ఎక్కువే.

కాబట్టి బాబా సెంటర్ల తరపుననైనా తప్పక స్వీకరించాల్సిన అవసరమైతే ఉంది.

*(గత సంచిక తరువాయి)*

# బాటసారులు

పూల్‌వాలా (పువ్వుల మనిషి)ని బెల్గామ్‌లో విశ్వనాథ్ కనిపెట్టేడు. అతడు వానిని గురించి బాబాకు వ్రాసేడు. బాబా చెప్పిన ప్రకారం పెండు, నీలు యిద్దరు పూల్‌వాలాను బెంగుళూరు తీసుకు వద్దామని వెళ్ళేరు.

పూల్‌వాలావంటి మస్తు ఇతరులు చెప్పినట్లు చేసే రకం కాదు. విశ్వనాథ్ సహాయంతో బాబా మనుష్యులిద్దరు కలిసి అపరాధ పరిశోధక నవల్లో వర్ణించే రీతిని వలలోవేసి చిక్కించు కున్నారు. మెల్లిగా ఒక టాక్సీలో మాయ చేసి ఎక్కించుకుని వెనుక సీటులో కూర్చోగానే పెండు, నీలు చెరోవైపునుంచి ఎక్కి ఇరుప్రక్కలా కూర్చుని తలుపులు మూసి వెంటనే బెంగుళూరికి యెకాయెకి బయలుదేరేరు.

ఆరవ భూమికకు చెందిన అసలైన జలాలీ మస్తు పూల్‌వాలా. బాబా అతనిని మెచ్చుకుంటూ ఒక మారన్నారు. "పూల్‌వాలాని చూడు ఒక్క లెంపకాయతో నిన్ను ఆరవ భూమికకు ఎత్తివేయగలడు" అని,

ఎరుపు రంగుతో కూడిన ముదురు గోధుమ వన్నె కలిగిన తలవెంట్రుకలు, కళాయి పెట్టినట్లుండి గట్టిపడిన చర్మము కలిగి, భరించలేని ఆనందం కళ్ళల్లో నుంచి తొంగిచూస్తూ ఏ క్షణంలోనైనా తన శరీరాన్ని వెయ్యి ముక్కలు చేస్తుందేమో అన్నంత పరమానందంతో నాటకపాత్రధారిలా కనిపిస్తాడు పూల్‌వాలా. అతనికి పువ్వులంటే ప్రీతి అందుకనే ఆపేరు వచ్చింది. నోటినిండా సున్నం వేసుకొని నమలడమంటే యిష్టం. ప్రతి రోజూ ఉదయాన్నే గులాబీలు మల్లెలు మొల్లలు, గుల్చేరి మెదలైన పుష్పాలు కోసి పట్టుకొచ్చియిస్తే దండలుకట్టుకొని తలకి పాగా చుట్టుకుంటాడు. సున్నం పంచదారతో కలుపు కొని ఒక గుడ్డముక్కలోచుట్టి నోట్లో పెట్టుకొని ఏకటాకీని గంటలకొద్దీ నమలుతాడు. బ్రహ్మాండమైన గొంతుకతో ఆజ్ఞలు జారీచేస్తూంటే ఎవరైనా ఉల్లంఘించడానికి వీలులేదే. జోహూకుమ్- అనవలసినదే. అంత అధికారం చలాయించే రీవి చూపించేవాడు. అతని హావభావాలు చూసి జనులు భయపడే వారు కూడాను. ఎవరైనా కనుపించినపుడు ఎదురుగా ముఖానికి దగ్గరగా వెళ్ళి తీక్షణమైన దృష్టితో హఠాత్తుగా చెయ్యి జాపి కళ్ళలోకి పొడుస్తాడేమో అన్నంత దగ్గరగా చూపుడు వేలుతో చూపిస్తూ ఏదో ఒక్కమాట ఆజ్ఞ యిచ్చినట్లు ఉచ్చరించి వాడిని హడలుగొట్టేవాడు. లేకపోతే దగ్గరగా వచ్చి అతని కళ్ళల్లోకి చూచి బెదరగొట్టేవాడు.

మస్తులు చాలామందికి ఉన్న అలవాటు ప్రకారం ఇతను కూడా చేతులకి, కాళ్ళకి, వ్రేళ్ళకి పాతగుడ్డ పీలికలు చుట్టుకొనేవాడు. మొదట వద్దన్నా తరువాత బాబాచేత





నీళ్ళు పోయించుకొని స్నానంచేసేవాడు. కాని ఎప్పుడూ నిలబడే స్నానం చేసేవాడు. క్షవరం చేయించుకోమంటే ఎప్పుడూ వద్దనేవాడు కాని ఒకనాడు ఈరుచ్‌ని బ్లేడ్ అడిగి పుచ్చుకుని రేజర్ లేకుండా వట్టి బ్లేడ్‌తోనే గడ్డం గీసుకున్నాడు.

తరువాత కొన్నాళ్ళకి మామూలు మనిషిలా ఉంటూ ఆశ్రమ నియమాలు పాటించేవాడు. అయితే అతని ఔద్ధత్యం మాత్రం అలాగే వుండిపోయింది. ఒక రోజున ఈరుచ్ విరిగిపోయిన మంచం ఒకటి బాగుచేస్తూంటే పనిముట్లు అడిగిపుచ్చుకొని తాను బాగా చేయగలనని చెప్పి వాటితో ఆ మంచం బాగుచేసేసరికి అతనికి నిజంగా వడ్రంగి పని బాగా చేయగలనని చెప్పి వాటితో ఆ మంచం బాగుచేసేసరికీ అతనికి నిజంగా వడ్రంగిపని బాగా వచ్చునని ఈరుచ్‌కి నమ్మకం కలిగింది. అప్పుడప్పుడు అతని స్వంత జీవితంలోని విషయాలు జ్ఞాపకం చేసుకుని చెపుతూండేవాడు. ప్రేమించే భార్యపిల్లలు ఉండేవారన్నాడు. ఒక రోజున కాఫీహొటలులో కూచుని వున్నప్పుడు ఏవరో అతనిచేతికి ఒక కప్పుతో కాఫీ యిచ్చేరుట. ఆ కాఫీ త్రాగే క్షణంలో ఏదో జరిగి ఉండాలి. అది చెప్పేటప్పుడుకూడా అతను ఆగిపోయి కొంతసేపు అలాగే రెప్పవాల్చకుండా చూస్తూండిపోయేడు. అప్పటినుంచి ఈ ప్రపంచ స్మృతి పోయినట్లుంది.

ఏప్రిల్ 1940లో మెహెర్‌బాబాకి మస్తు ఆశ్రమం వచ్చినపుడు పూల్ వాలానికూడా అక్కడికి తీసికెళ్లేరు. తరువాత జూన్‌లో అతనిని బెల్గామ్ తిరిగి పంపించేశారు.

మూడువంతులు జమాలీ ఒక్క వంతు జలాలీ ఆయిన చిన్నస్వామి మూడవ భూమికలోని మస్తు. అతడు షరియత్‌ఖాన్ ఇద్దరూ తమాషాలుచేస్తూ ఆశ్రమం ఆనందమయంగా ఉంచేవారు. చిన్న స్వామిని బాబా మొట్టమొదట తిరువేంద్రంలో 1940 జనవరిలో కలుసుకున్నారు. అప్పటి నుండి అతనంటే బాబాకి చాలా ఇష్టం. బెంగుళూరు ఆశ్రమానికి ఆయనతో అతన్ని తీసుకువచ్చేరుకూడా. మకాకోజాతి కోతిలా ముఖమూ అతనూ బక్కపలచగా మరీ నల్లగా ఉండే ముసలివాడు అతడు. తమలపాకులు నమలడమంటే మహాయిష్టం. ఎప్పుడూ నోటినిండా తాంబూలం వేసుకొని ఎఱ్ఱగా రసంతో నములుతూ ఉండేవాడు. ఎవరూ త్రాగలేనంత వేడిగా టీ తాగేవాడు తను. సిగరెట్ కాల్చేటప్పుడు నిప్పు ఉన్నకొస నోట్లో పెట్టుకొనేవాడు. కాల్చడం అయిన తరువాత ఆ సిగరెట్ ముక్కను నిప్పుతో సహా నమలివేసి ఆర్పేసేవాడు.

ఒక గుడిసె వెనకాల ఉన్న సందులో ఎలక్ట్రిక్ స్తంభం తీగెలు సరిగా లేక పోవడమువల్ల షాక్ తగులుతుందేమో అని అందరూ దానికి దూరంగా తొలగినడిచే వారు ఇతనుమాత్రం ఆ స్తంభాన్ని కౌగలించుకుని అదే ఆనందంలా దానిచుట్టూ తిరిగి నాట్యం చేసేవాడు. **- సశేషం**

# జీవిత సభ్యత్వం

## 2011 జనవరి– ఫిబ్రవరి నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | నెల | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | జనవరి 10 | ఎన్. ఈశ్వర్, సికింద్రాబాద్ | రు. 500.00 |
| 2. | జనవరి 10 | పి.యం. రమేశ్, హైదరాబాద్ | రు 1000.00 |
| 3. | జనవరి 10 | డా॥ రామకృష్ణ, నిజామాబాద్ | రు. 500.00 |
| 4. | జనవరి 10 | చిన్నం వెంకటరామ్ రెడ్డి, కొంకుదురు, తూర్పు గోదావరి | రు. 950.00 |
| 5. | జనవరి 10 | ఎన్. గుణ లక్ష్మి, విశాఖపట్నం | రు. 1000.00 |
| 6. | జనవరి 10 | కె. ప్రభాకర మూర్తి, విజయవాడ | రు. 500.00 |
| 7. | జనవరి 10 | పి. పవన్ కుమార్, కరీంనగర్ | రు. 1000.00 |
| 8 | జనవరి 10 | ఎస్. శ్రీధర్, బాలకొండ | రు. 500.00 |
| 9. | జనవరి 10 | జి. నరేందర్, నిజామాబాద్ | రు. 500.00 |
| 10 | జనవరి 10 | జి. విఠల్, సిద్దిపేట్ | రు. 500.00 |
| 11 | జనవరి 10 | ఎం.సింహా రెడ్డి, ఖమ్మం | రు. 1000.00 |
| 12 | జనవరి 10 | కె.నాగేశ్వర రావు, శ్రీకాకుళం | రు. 500.00 |
| 13 | జనవరి 10 | వంకా నాగరాజు, నిజామాబాద్ | రు. 500.00 |
| 14 | జనవరి 10 | చుందూరు మెహెర్ వెంకట సత్యనారాయణ, హైదరాబాద్ | రు. 1000.00 |
| 15 | ఫిబ్రవరి 10 | బి. వెంకటేశం, హైదరాబాద్ | రు. 500.00 |
| 16 | ఫిబ్రవరి 10 | ఎం. పట్టాభి చౌదరి,సింధనూర్,కర్ణాటక | రు. 1000.00 |
| 17 | ఫిబ్రవరి 10 | జై బాబా ఫోటోగ్రాఫర్, సింధనూర్, | రు. 500.00 |
| 18 | ఫిబ్రవరి 10 | ఆర్.వి. సాంబి రెడ్డి, నిజామాబాద్ | రు. 1000.00 |
| 19 | ఫిబ్రవరి 10 | గబ్బుల శ్రీనివాస్, కరీంనగర్ | రు. 800.00 |
| 20. | ఫిబ్రవరి 10 | రావికంటి పద్మాకర్, మంచిర్యాల, | రు. 500.00 |
| 21. | ఫిబ్రవరి 10 | యం. ఆనంద కుమార్ | రు. 250.00 |
| 22. | ఫిబ్రవరి 10 | యం. బాల క్రిష్ణారావు. సికింద్రాబాద్ | రు. 500.00 |
| 23. | ఫిబ్రవరి 10 | పి. నిరంజన్ బాబు, రంగారెడ్డి జిల్లా. | రు. 500.00 |
| | | **మొత్తం** | **రు15,500.00** |





# ప్రభుస్తుతి

### ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట వున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకములలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య,
జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోన్నతుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు, అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురామజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.